లీడర్

సంచలన వార్తా పత్రిక

SANCHALANA VAARTHA PATRIKA LEADER

Read / Share / Follow

www.leaderepaper.com

www.facebook.com /leaderramanamurthy/

శుక్రవారం • 16 ఫిబ్రవరి 2018 । సంపుటి : 20 సంచిక : 200 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00

Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

ప్రాణం కన్నా.. సెల్ఫీనే ముద్దు



విశాఖ ఆర్కేబీచ్‌లో సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు. ప్రమాదం అని తెలిసినా పట్టించుకోకుండా సాహసోపేతంగా ఫోటో తీసుకుంటున్న యువతులు - ఫోటోగ్రాఫర్, న్యూస్‌లీడర్

లూలూ మామూలు



రాబడి ఆరున్నర కోట్లు

దోపిడి 900 కోట్లు

ఇదీ విశాఖ కన్వెన్షన్ సెంటర్ కథ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని అడ్డ.గోలుగా లూలూ సంస్థకి అప్పగించిన ప్రభుత్వ వైఖరిని అంతా ఎండగడుతున్నా ప్రభుత్వం మాత్రం నేనింతే అనే ధోరణినే కొనసాగిస్తోంది. నేర చరిత్ర కలిగిన ఓ అంతర్జాతీయ సంస్థకు ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా ఇవ్వడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎందుకంత అత్యుత్సాహం చూపుతున్నారని మేధావి వర్గం ప్రశ్నిస్తోంది. అంతే కాకుండా అనేక ప్రత్యామ్నాయాలను కూడా సూచిస్తున్నా, ముఖ్యమంత్రి మాత్రం తన ఒంటెత్తు పోకడనే కొనసాగిస్తున్నారు. దీనికి కారణాలేమిటో బయటపడాల్సి ఉంది. లూలూ వంటి సంస్థకి ఇటువంటి ప్రాజెక్టులను అప్పగించడమే అక్రమమని గగ్గోలు పెడుతూంటే ఇక ఈ స్థలానికి సంబంధించిన ఆర్థిక వివరాలు తెలిస్తే ముక్కున వేలేసుకోవడం తప్పదు. లూలూ సంస్థకి ప్రభుత్వం తొలుత 9.12 ఎకరాల భూమిని కేటాయించింది. కాని లూలూ సంస్థ తన ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలు కావడానికి మరికొంత భూమి కావాలని ప్రభుత్వాన్ని కోరింది. ఆ భారాన్ని కూడా ప్రభుత్వమే నెత్తిన వేసుకుంది. ఓ ప్రయివేటు సంస్థ నుంచి 3.4 ఎకరాల భూమిని సేకరించి మరీ లూలూ సంస్థకు ఇచ్చింది. దీంతో కలిపి లూలూకి ఇచ్చిన మొత్తం భూమి విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం 905.8 కోట్లు. అయితే ఈ మొత్తం భూమికి లూలూ చెల్లించేది సంవత్సరానికి రూ 6.27 కోట్లు. దీనిని బట్టి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఎంత కారుచౌకగా లూలూకి అప్పగిస్తున్నారో స్పష్టమవుతోంది. ప్రత్యక్షంగా ఈ విషయం కనబడుతుండగా పరోక్షంగా ప్రభుత్వ ఖజానాకు మరింత నష్టం వాటిల్లుతోంది. ప్రయివేటు సంస్థ నుంచి తీసుకున్న 3.4 ఎకరాల భూమికి గాను ప్రత్యామ్నాయంగా 4.85 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కేటాయిస్తున్నారు. దీని విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం 321 కోట్లు. వ్యవహారం మొత్తం చూస్తూంటే లూలూకి లబ్ధి చేకూర్చడమే పరమావధిగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నట్టు స్పష్టమవుతోంది. 900 కోట్ల విలువైన భూమికి ఏడాదికి 6.27 కోట్లు చెల్లిస్తోందంటే లూలూ ఈ ఒక్క ప్రాజెక్టు ద్వారా ఏ స్థాయిలో లబ్ధి పొందుతోందో ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది.

విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులో ఉన్న అత్యంత ఖరీదైన ఈ స్థలాన్ని అభివృద్ధి చేయడానికి తొలుత టెండర్ల ప్రక్రియనే ప్రారంభించారు. కాని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం ఈ ప్రాజెక్టును లూలూకి అప్పజెప్పాలని ఎప్పటి నుంచో ఆసక్తిగా ఉన్నారు. గతంలో ఆయన కేరళలోని కొచ్చికి వెళ్ళినప్పుడు ఈ లూలూ సంస్థకు చెందిన మెగా షాపింగ్ మాల్‌ను సందర్శించడం,

మిగతా 2లో ▶

విశాఖలో కేంద్ర బృందం



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో తనిఖీ నిర్వహిస్తున్న బృందం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖ మహా నగరంలో స్వచ్ఛతపై సమీక్షిం చేందుకు కేంద్ర బృందం విచ్చేసింది. గురువారం నగరంలోని పలు వార్డుల్లో కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా రూపొందించిన ఆరు ప్రశ్నలకు సంబంధించి ప్రజల నుంచి సమాధానాలు కోరారు. నగరంలో స్వచ్ఛతను పెంపొం దించేలా జీవీఎంసీ చేపడుతున్న చర్యలపై ఆయా ప్రశ్నలు ఉంటా యి. స్థానికంగా, స్వయంగా వారు సేకరించే సమాధానాల ఆధారంగా జీవీఎంసీకి మార్కులు కేటాయిస్తారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కూడా ముందుగానే ప్రజలకు దీనికి సంబంధించిన సమాచారం అందించింది. వార్డుల్లోకి వచ్చే వారికి సరైన సమాధానాలు ఇచ్చి జీవీఎంసీ ర్యాంకింగ్‌కు తోడ్పడాలని జీవీఎంసీ అధికారులు కోరారు. ప్రజలు కూడా కేంద్ర బృందానికి అవసరమైన సమాచారం అందించడంలో ముందంజలోనే ఉన్నారు.

సస్పెండ్ చేశారని చంపేశాడు



ఫ్లోరిడా స్కూల్లో తూటాల వర్షం

కాల్పులు జరిపింది స్కూలు విద్యార్థే

పార్క్‌ల్యాండ్: పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన ప్రాయం స్నేహితులతో సరదాగా ఆడి పాడే వయసు కానీ అతడు అలా చేయలేదు. పుస్తకాలు వదిలి తుపాకీ పట్టుకు న్నాడు. తోటి స్నేహితులనే అతి దారుణంగా చంపేశాడు.

మిగతా 2లో ▶

రాజకీయం.. గేటు బయటే జనసేన

పోటీ చేయాలంటే ఇంకా చాలా అడుగులు పడాలి

జిల్లా స్థాయి నాయకత్వం కరవు

విజయనగరానికి సేనాని ఎవరు ?




ప్రత్యేకప్రతినిధి : ప్రజాదరణ వేరు...రాజకీయ ఆదరణ వేరు..ప్రజాదరణ ప్రజామోదంగా మారినప్పుడే రాజకీయ ఆదరణ లభిస్తుంది. అదే అధికారానికి సోపానం అవుతుంది. జనసేనానికి ఇప్పుడున్నది ప్రజాదరణే అని వేరే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. శంఖంలో పోస్తేనే గానీ తీర్థం కాదు. ఆ తీర్థం సేవిస్తేనేగాని దేవుడు దర్శనం సంపూర్ణం కాదు. జనసేనానిగా అశేష ప్రజానీకానికి దిశానిర్దేశం చేస్తున్న జనసేన అధిపతి పవన్‌కళ్యాణ్ ఇంకా రాజకీయ ప్రవేశంలో ప్రథమాంకంలోనే ఉన్నారు. రాజకీయం అంటే విమర్శలుకాదు. రాజకీయం అంటే ఆరోపణలు కాదు. రాజకీయం అంటే పార్టీలు మారడం కాదు. రాజకీయం అంటే ప్రకటనలు గుప్పించడం కాదు. అంతేకాదు రాజకీయం అంటే

మిగతా 7లో ▶

ప్యాకేజికి అందుకే ఒప్పుకున్నా..!

- 29సార్లు ఢిల్లీకి వెళ్లినా అన్యాయమే చేశారు
- టీడీపీ సమన్వయ సమావేశంలో చంద్రబాబు



అమరావతి : ప్రత్యేక హోదా కంటే ఎక్కువ ప్రయోజనాలు ప్యాకేజీ రూపంలో ఇస్తామంటేనే ఆనాడు ఒప్పుకున్నామని.., ఈ విషయంపై నేతలంతా స్పష్టతతో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్ధేశం చేశారు.అందుబాటులో ఉన్న పార్టీ నేతలు, మంత్రులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఉండవల్లిలో జరిగిన సమన్వయ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ ఇకపై రోజూ పార్టీకి కొంత సమయం కేటాయిస్తానని, త్వరలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్నారు. కేంద్ర బడ్జెట్లో అన్ని రాష్ట్రాల మాదిరిగానే ఏపీకి కేటాయింపులు జరిపారు తప్ప.. ప్రత్యేకంగా చేసిందేమీ లేదని సీఎం స్పష్టం చేశారు. 29సార్లు దిల్లీ వెళ్లినా బడ్జెట్లో

మిగతా 2లో ▶

మాట తూలితే..జైలుకే

సామాజిక మాధ్యమాల్లో బెదిరింపులపై ప్రత్యేక చట్టం

కోర్టు అనుమతి లేకుండానే అరెస్టు



ప్రత్యేక ప్రతినిధి : నోటిని అదుపులో ఉంచుకోకుండా అడ్డగోలుగా బెదిరింపులకు పాల్పడినా... ఆకాశరామన్న ఉత్తరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా కించపరచడం, దూషణలు, బెదిరింపులకు పాల్పడితే ఇకపై ఇబ్బందులు తప్పవు. ఒకవేళ అవి నేరపూరిత బెదిరింపులైతే కటకటాలను లెక్కించాల్సిందే. ఐపీసీ సెక్షన్ 506, 507కు సవరణలకు తెలంగాణ ప్రభుత్వం యత్నిస్తోంది. ఇప్పుడున్న భారత శిక్షా స్మృతి

మిగతా 2లో ▶


"కాపు" కాయం.. బీజేపీ రియాక్షన్

అమరావతి : బడ్జెట్‌లో ఏపీకి న్యాయం చేయలేదంటూ టీడీపీ ఎంపీల యాక్షన్‌కు కేంద్రం రియాక్షన్ ఇచ్చింది. కాపులను బీసీలో చేరుస్తామన్న చంద్రబాబు ఎన్నికల హామీకి బీజేపీ బ్రేక్ వేసింది. కాపు రిజర్వేషన్ కోటా ప్రయత్నాలు సాధ్యం కాదని తేల్చేసింది. సుప్రింకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఏపిలో ఇప్పటికే రిజర్వేషన్ 50 శాతం దాటిపోయింది కాబట్టి కాపులకు రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చెల్లుబాటుకాదని పేర్కొంది. కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బీసీల్లో చేర్పించాలని మంత్రివర్గం ఆమోదించింది. తర్వాత అదే బిల్లును అసెంబ్లీలో కూడా ప్రవేశపెట్టి సభ ఆమోదం కూడా వేయించుకున్నది. అక్కడి నుంచే బిల్లును కేంద్రం ఆమోదం కోసం చంద్రబాబునాయుడు ఢిల్లీకి పంపారు. ప్రస్తుతం బిల్లు హెూంశాఖ పరిశీలనలో ఉంది. కాపులను

మిగతా 2లో ▶

కృష్ణమూర్తి అడ్డదారులకు అధికారులే దిక్సూచి

నకిలీ ఎఫ్ఎంసీకి జీవీఎంసీ ఉద్యోగి హామీ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : పెళ్లాన్ని చెల్లెలుగా చిత్రీకరించి జీవీఎంసీలో ఉద్యోగం కొట్టేయాలనుకున్న మొండి కృష్ణమూర్తికి జీవీఎంసీ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్టు తెలుస్తోంది. అడ్డదారిలో ఆయన ఉద్యోగం కోసం చేస్తున్న ప్రతి ప్రయత్నం వెనుక జీవీఎసీ ఉద్యోగుల ప్రోత్సాహం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగాలి వ్వాల్సిన వారు ఇలా ఒక వ్యక్తి కోసం అన్ని రూల్స్‌ను తారు మారు చేసేందుకు సైతం ఎందుకు సిద్ధ పడుతున్నారో అర్థం కావడం లేదు. ఆయనకు జీవీఎంసీ అండదండలున్నాయనడానికి ఒక నిదర్శనం కూడా ఉంది. కృష్ణమూర్తి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో వయసు మార్చుకుని ఆ తర్వాత తహాశీల్దార్ వద్ద తప్పును ఒప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే అంతటితో ఆగకుండా జీవీఎంసీకి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసిన సమయంలో కూడా మరో పెద్ద తప్పు చేశాడు. ఫ్యామిలీ

మిగతా 2లో ▶

మరుగుదొడ్లు నిర్మించుకోకపోతే ప్రభుత్వ పథకాలు రద్దు

జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



రేబాకలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్ : ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, లేకుంటే ప్రభుత్వం నుంచి అందే పథకాలను రద్దు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మండలంలోని రేబాక గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. దీనిలో భాగంగా గ్రామంలో నిర్మాణంలోఉన్న వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం మన

మిగతా 2లో ▶

సంచలన వార్తాపత్రిక
లీడర్ క్లాసిఫైడ్స్

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు. - మేనేజ్‌మెంట్

విశాఖపట్నం | శుక్రవారం 16-2-2018 | Minimum 1 week | రోజుకి రూ.40/- మాత్రమే Size : 1x3

CONTACT : 92466 21490 / 92982 05388 | 5% GST EXTRA

SELL & BUY
Old & Used Home / Office Furniture, Sofas, Dining / Office Tables, Cots, Alamirah, Racks, TV, Fridge, Fans, Curious... and more on your behalf..
KKM's TRANSMIT SERVICES
Opp. Sampat Vinayaka Temple, Asilmetta Up Vizag-3.
Ph: 0891-2755866, 2701716
(BY AN EDUCATED SELF EMPLOYED)

లోకేష్ గోల్డ్ లోన్స్
మీ బంగారం బ్యాంక్ / ప్రైవేట్ సంస్థల్లో ఉన్నదానిని విడిపించి మార్కెట్ రేటుకు కొనబడును.
7799 22 3300


GENERAL

LOANS..LOANS
వ్యాపారం/చదువు/పెళ్లి అవసరాలకు 5 Crores వరకు House/Flat/Vuda Sites పై Mortgage Loans. House/Flat/Site కొనుగోలు కొరకు Loans. Income tax లేనివారు Cibil Problem వున్నవారు కూడా సం॥
91330 19488


WANTED

JOBS...JOBS
Fire & Safety Training
ఇచ్చి ఉద్యోగం కల్పించబడును.
Qly : 10th, Inter, Any Degree/PG.
84990 12143
98859 48180


EDUCATION

లెక్చరర్ల శిక్షణ సంస్థ
ఐఐటీఐట్-అకౌన్ట్స్, నెయిన్స్ & నీట్ లెక్చరర్లకు మ్యాత్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ & జువాలజీ లందు కంటెంట్ శిక్షణ + ఎక్స్‌ట్రా ఇంగ్లీష్ + ఎక్స్‌ట్రా హిందీ + స్పీడ్ మ్యాథ్స్‌లందు 75 రోజులు, 700 గంటలు ప్రాక్టికల్ ట్రైనింగ్ (హైదరాబాద్) జలరాం
94402 79283
98855 26890

వెన్నెల ఫంక్షన్ హాల్ ఫ్రీ
హోటల్ ఆర్డరుకు వారికి సెంట్రల్ ఏసీ
ఎస్.ఏ.డి. జంక్షన్, వైజాగ్.
అతితక్కువ రేట్లకే క్యాటరింగ్ & హాస్టల్స్ ఆఫీస్‌లకు ఫుడ్ సప్లయ్. హోటల్‌లో రూ. 79/-లకే 30 రకాల ఐటమ్స్‌తో విందు భోజనం
72889 99970

HOME LOANS
ఆదాయంతో సంబంధం లేకుండా Home/Mortgage/ Business/ Loans (మీ ఆస్తి పై) అతి తక్కువ వడ్డీకి 5 రోజులలో లోను ఇవ్వబడును
SVL HOME LOANS
8886155155

LEASE / RENT
అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేట్ ఎదురు రోడ్డులో 4 ఫ్లోర్స్ 10000 Sft గల బిల్డింగ్ (గణేష్ స్పేస్ ఎదురుగా) హాస్పటల్స్, స్కూల్స్, ఆఫీస్‌లకు అనువైనది.
92466 73199
94945 83444

PLOT FOR SALE
పైడి భీమవరం దగ్గర హైవే ఫేసింగ్ అప్రూవ్డ్ లేఅవుట్ 25 ఎకరాల వెంచర్‌లో గేటెడ్ కమ్యూనిటీ గజం రూ.3900/- డైరెక్ట్ రిజిస్ట్రేషన్‌తో అమ్మబడును.
83328 23999

అనుభవం గల **వెయిటర్స్, హెల్పర్స్, క్లీనర్స్ కావలెను**
Real DEEPAK PUNJABI DHABA A/C
హోటల్ మేఘాలయ ఎదురుగా, ఆశీలమెట్ట, వైజాగ్.
93931 09246
0891-2743637

కావలెను
టార్గెట్ లేకుండా జీతం పద్ధతి పై ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్ నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్ మరియు రిట్రైర్డ్ పర్సన్స్, వి.ఆర్.ఎస్. పర్సన్స్, గృహిణులు కావలెను.
96429 29039

EDUCATION
డిగ్రీ రెగ్యులర్ లేదా డిస్టెన్స్‌లో చదివి డిస్కంటిన్యూ అయిన వారికి ఒకే సంవత్సరంలో డిగ్రీ పూర్తి. AU డిస్టెన్స్ (పాస్ గ్యారంటీ కోచింగ్/గైడెన్స్)
BA/B.Com/B.Sc/MA/M.Com/M.Sc, Diploma/B.Tech/10th/Inter
98487 21118
99850 61118

VIVO healthcare
SKILLING INDIA TO SAVE LIVES
ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
100% స్కాలర్‌షిప్
మైనార్టీ యువతకు
కోర్సుల వివరాలు :
ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్
డయాలసిస్ టెక్నిషియన్
ఫ్లేబోటోమి టెక్నిషియన్
డెంటల్ అసిస్టెంట్
జనరల్ డ్యూటీ అసిస్టెంట్
Call : 90150 46000
ద్వారకానగర్, విశాఖపట్నం

భగవద్గీత ఉచితంగా నేర్పబడును
అనకాపల్లి గవరపాలెం గౌరీసంఘంలో గల గీతా మందిరం నందు ప్రతి శనివారం సా॥ 5 గంటల నుండి 7 గంటల వరకు
పిల్లలు పెద్దలు అందరూ ఆహ్వానితులే
7675813632

BUY & SELL
Old House Hold/ Office/Shop/Hotel/ Furniture
{T.V., FANS, Zym Exercise Cycles, SOFAs, Cots Alamaras, Tabels & Chairs Frig.}
MASETTY & CO.
AUCTIONERS
Nehru Bazar, Dwarakanagar, Visakhapatnam -16.
Ph: 2798616, 2563759

హోమియో
చర్మ, కీళ్ళు, గ్యాస్ట్రిక్, షుగర్, బిపి, ఉబ్బిపిర్లు, థైరాయిడ్, కిడ్నీ, గర్భాశయ, మానసిక, శారీరక వ్యాధులు, ఎలర్జీ, ఆస్తమా మొదలగు దీర్ఘవ్యాధులకు
అభినందన
హోమియో క్లినిక్
డా॥ మోటూరి శ్రీరామకృష్ణ MD
వారణాసి మెజెస్టిక్, 2వ లైను, ద్వారకానగర్, పిజ్జాహట్ ఎదురుగా, విశాఖపట్నం - 16
9290128515
8019141135
అన్ని వ్యాధులకు తక్షణమే సంప్రదించండి

ప్యాకేజికి అందుకే ఒప్పుకున్నా..!

(మొదటిపేజీ తరువాయి)

మనకు మళ్లీ అన్యాయం చేశారని..., హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం కొనసాగించాల్సిందేనని తేల్చి చెప్పారు. తెలుగుదేశం క్రమశిక్షణ కలిగిన పార్టీ అని గుర్తు చేసిన చంద్రబాబు... అనవసరంగా ఎప్పుడూ ఒకరిని నిందించబోమన్నారు. నోట్ల రద్దు, ఇతరత్రా సమస్యలు తలెత్తినప్పుడు కేంద్రానికి అండగా నిలిచామన్నారు. రాష్ట్ర విభజన వల్ల చాలా నష్టపోయాం అందుకు తగ్గ న్యాయం జరగాల్సిందేనన్నారు. పార్లమెంట్ సమావేశంలో పార్టీ ఎంపీలు బాగా పనిచేసి ఏపీ సమస్యను దేశస్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. రానున్న రోజుల్లోనూ ఇదే పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కేంద్రంతో మిత్రపక్షంగా కొనసాగుతోంది రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని పదవుల కోసం కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. వాజ్ పేయి హయాంలో తొమ్మిది కేంద్ర మంత్రి పదవులు ఇస్తామన్నా వెంటపడలేదని చంద్రబాబు గుర్తు చేశారు.

కావలెను
పూర్ణామార్కెట్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ సిబ్బంది కావలెను
సిటీ లిమిట్స్‌లో కలవారికి ప్రాధాన్యం
94414 54063
98485 61212

డ్రైవర్లు కావలెను
OLA & UBER
టాక్సీ నడుపుటకు బ్యాడ్జి కలిగి అనుభవం గల డ్రైవర్లు వెంటనే కావలెను
జీతం : రూ. 12,000/-
99662 25019

రిసెప్షనిస్ట్ (M) కావలెను
శ్యామ్ డార్మెటరీ
2వ అంతస్తు, టైటాన్ షోరూం బిల్డింగ్ ద్వారకానగర్, వైజాగ్.
92466 15866

టైలర్స్ కావలెను
నైటీస్ కుట్టుటకు అనుభవం గల టైలర్స్
మర్రిపాలెం ఏరియా, పిఎఫ్ ఆఫీస్ దగ్గరలో పనిచేయుటకు కావలెను.
89789 18337

10th/INTER/DEGREE ONE SITTING ADMISSIONS
ALL DEGREE/DIPLOMA ADMISSIONS IN DISTANCE AND REGULAR MODE AVAILABLE FROM GOVT UNIVERSITIES
TEAMS 9885847768 8121527999

లీడర్
చదవండి !
చదివించండి!!

మరుగుదొడ్లు నిర్మించుకోకపోతే ప్రభుత్వ పథకాలు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో సుమారు 6వేల మరుగుదొడ్ల నిర్మాణం కావాల్సి ఉండగా ప్రస్తుతం 4వేలు మాత్రమే నిర్మాణంలో ఉన్నాయన్నారు. మిగిలిన త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రేబాకలో మిగిలిన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే నిర్మాణాలు పూర్తిచేసుకున్నవారికి 2 వారాల్లోగా పేమెంట్లు చేయాలని లేకుంటే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కళ్యాణ్‌కుమార్, ఆర్డీవో ఎంవీ సూర్యకళ, ఎంపీడీవో టీవీ రమణ, తహసీల్దార్ బి.సత్యనారాయణ, సర్పంచ్ మంత్రి జ్యోతి, పీఆర్ జేఈ ఎస్.పరదేశినాయుడు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ రియాక్షన్

(మొదటిపేజీ తరువాయి)

బీసిల్లో చేరుస్తాననేది గత ఎన్నికలపుడు చంద్రబాబిచ్చిన హామీ. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ అమలుకు ముద్రగడ పద్మనాభం వంటి నాయకులు చేపట్టిన ఉద్యమం ద్వారా హామీపై పట్టు బిగిసింది. పెద్ద ఆందోళనలే జరగటం, మంజునాథ కమీషన్ వేయటం, ఏడాదిన్న తర్వాత కమీషన్ రిపోర్టు ఇవ్వటం అందరికీ తెలిసిందే. ఆ రిపోర్టునే హడావుడిగా మంత్రివర్గంలో తీర్మానం చేయించి అసెంబ్లీలో బిల్లు ఆమోదింప చేసుకుని ఢిల్లీకి పంపారు. ప్రస్తుతం హోంశాఖ పరిశీలనలో ఉన్న బిల్లును డీవోపీటీ (కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ) నిలిపేసింది. రిజర్వేషన్ల శాతం 50 దాటిపోయింది కాబట్టి ఏపీలో కాపులకే బీసీ రిజర్వేషన్‌లో చేర్చటం సాధ్యం కాదని తేల్చేసింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలంటూ చంద్రబాబు కోరినా సాధ్యం కాదని కేంద్రం తేల్చేసింది.

లూలూ మామూలు

(మొదటిపేజీ తరువాయి)

లూలూ ఛైర్మన్ యూసుఫ్ అలీని వ్యక్తిగతంగా కలవడం జరిగాయి. వాస్తవానికి అప్పుడే చంద్రబాబు నాయుడు లూలూకి విశాఖ కన్వెన్షన్ ప్రాజెక్టును అప్పగించాలని ఫిక్సయిపోయారు. మధ్యలో టెండర్ల ప్రస్తావన ఎందుకు వచ్చిందో మరి! ఇంకా టెండర్ల వ్యవహారం నడుస్తుండగానే ముఖ్యమంత్రి స్వయంగా కల్పించుకొని అన్నీ పక్కనబెట్టి దగ్గర ఉండి మరీ లూలూకి ప్రాజెక్టు అప్పగించేశారు. విశాఖ కన్వెన్షన్ ప్రాజెక్టుకు సంబంధించి అనేక అంశాలు ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోయాయి. నగరంలో అవసరానికి మించి కన్వెన్షన్ హాళ్ళు ఉన్నాయి. కొత్తవి అవసరంలేదు. లూలూ గ్రూపుకి అంతర్జాతీయంగా నేర చరిత్ర ఉంది. ఏకంగా సంస్థ డైరెక్టర్‌కి జైలు శిక్షే పడింది. అటువంటి సంస్థకి ప్రాజెక్టు అప్పగించాలని చంద్రబాబు నాయుడు ఎందుకు పట్టుపట్టారు? ఈ ప్రాజెక్టును చేపట్టే సామర్థ్యంగల సంస్థలు మనదేశంలోనే ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లో ఉన్నాయి. వాటికి అప్పజెప్పకుండా లూలూకే ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? ఏడాదికి సంస్థ ఇచ్చే లీజు మొత్తాన్ని ఏ ప్రాతిపదికన నిర్ణయించినట్టు? అంతకంటే ఎక్కువ మొత్తం ఇచ్చే సంస్థలు లేకనా? లేక చంద్రబాబునాయుడికి ప్రత్యేకమైన ఆసక్తి ఏదైనా ఉందా? భూములు అప్పగించే విషయంలో న్యాయపరమైన అభ్యంతరాలను సైతం ముఖ్యమంత్రి విస్మరించారని చెబుతున్నారు. కలెక్టర్ కూడా కొన్ని అభ్యంతరాలను లేవనెత్తినట్టు విశ్వాసనీయంగా తెలిసింది. ఇన్ని వివాదాలు, అభ్యంతరాలు, నష్టాలు పక్కనబెట్టి మరీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టును లూలూ సంస్థకి అప్పగించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సస్పెండ్ చేశారని చంపేశాడు

(మొదటిపేజీ తరువాయి)

అమెరికాలోని ఫ్లోరిడాలోని పార్క్ ల్యాండ్‌లో గల మర్జోరీ స్టోన్‌మన్ డగ్లస్ స్కూల్‌లో భీకర కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పులు జరిపింది అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థి అని తెలియగానే యావత్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది. క్రమశిక్షణగా ఉండటం లేదని స్కూల్ నుంచి సస్పెండ్ చేయడంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిసి అందరూ షాక్‌కు గురవుతున్నారు. నికోలస్ క్రూజ్ అనే 19ఏళ్ల విద్యార్థి ఈ కాల్పులకు తెగబడ్డాడు. స్కూల్ నుంచి సస్పెండ్ చేశారన్న కోపంతో అన్యాయంగా 17 మందిని బలిగొన్నాడు. నికోలస్ ప్రవర్తన బాగాలేదని.. క్రమశిక్షణ తప్పాడని గత విద్యా సంవత్సరం నుంచి అతడిని సస్పెండ్ చేశారు. దీంతో నికోలస్ ఇంతటి దారుణానికి ఒడిగట్టాడు. పాఠశాలలోకి ప్రవేశించిన వెంటనే విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడిన దుండగుడు.. అడ్డుకోవడానికి ప్రయత్నించిన ముగ్గురిని కాల్చేశాడు. అనంతరం పాఠశాలలోని ఫైర్ అలారం మోగించాడు. దీంతో ఏదో జరిగిందన్న ఆందోళనతో అందరూ ప్రవేశ ద్వారం వైపు పరిగెత్తుకుంటూ వచ్చారు. అక్కడే కాచుకుని ఉన్న నికోలస్.. వారిపై విచక్షణా రహితంగా కాల్చేశాడు. అనంతరం పోలీసులపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో పోలీసులు కూడా దుండగుడిపై ఎదురు కాల్పులకు దిగారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. నికోలస్ సోదరి కొద్ది రోజుల క్రితమే మరణించింది. ఆ తర్వాత నుంచి తీవ్ర ఉద్వేగానికి, ఒత్తిడికి లోనైన నికోలస్.. ఇలా విద్వేషాన్ని పెంచుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నికోలస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తుపాకీలన్నా.. చంపడమన్నా ఇష్టమే..: నికోలస్ ప్రవర్తన చాలా వింతగా ఉండేదని అతడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను చూస్తే అర్థమవుతోంది. నికోలస్‌కు తుపాకీలంటే చాలా ఇష్టం. ఎప్పుడూ తుపాకీ పట్టుకుని ఫొటోలు తీసుకునేవాడు. దీంతో పాటు బల్లి, కప్ప లాంటి చిన్ని చిన్ని జీవులను చిత్రహింసలు చేసి చంపేవాడు. వాటి ఫొటోలను తీసి సోషల్‌మీడియాలో పోస్టుచేసి ఆనందపడేవాడు.

తోటి విద్యార్థులతోనూ గొడవలే..:

అయితే ముందు నుంచీ నికోలస్ తీరు ఇలాగే ఉండేదని అక్కడి ఉపాధ్యాయులు చెబుతున్నారు. తోటి విద్యార్థులను బెదిరించేవాడట. 'మిమ్మల్ని కాల్చేస్తా' అంటూ గతంలోనూ పలుసార్లు పిచ్చి జోకులు వేసేవాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఎప్పుడూ ఎవరో ఒకరితో గొడవపడేవాడని.. స్కూల్ గోడలకు తన చేతులను బలంగా కొట్టుకునేవాడని చెప్పారు. నికోలస్ వల్ల మిగతా విద్యార్థులకు ప్రమాదం ఉందని భావించిన యాజమాన్యం అతడిని స్కూల్ నుంచి తొలగించింది.

బహిరంగ ప్రకటన

యిందు మూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా నాక్లయింటు అయిన శ్రీమతి కూటికుప్పల ఇందుమతి W/o ప్రకాష్‌రావు, డోర్ నెం. 8-20-1, తమిళవీధి, చిన వాల్తేరు, విశాఖపట్నం 530017 నివాసిని విశాఖపట్నం నగరం డోర్ నెం.9-9-3920/1, మంగాపురం కాలని, శివాజీపాలెం, విశాఖపట్నం-17 నివాసులు అయిన శ్రీమతి పాలకొల్లు నాగమణి W/o రమాశంకర్ రావు (2) పాలకొల్లు గణేష్ కుమార్, S/o రమాశంకర్ రావులు పై విశాఖపట్నం రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో O.S. 629/2017 సివిల్ దావా దాఖలు చేయటం జరిగినది సదరు కోర్టువారు I.A 393/2017 IN O.S. 629/2017 ద్వారా క్రింది ఉదహరించబడిన షెడ్యూలు ఆస్తిని అటాచ్‌మెంట్ జరిగినది. కావున యావన్మంది ప్రజలకు ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా షెడ్యూల్డు ఆస్తిని ఎవరైనా కొనుగోలు చేసినట్లయితే అటువంటి కొనుగోలులు చెల్లనేరవు. షెడ్యూల్డు ఆస్తిపై పూర్తి హక్కులు నా క్లయింటుకు సంక్రమించినవి అదేవిధంగా షెడ్యూల్డు ఆస్తిని నా క్లయింటుకు స్వాధీనం చేయుటం జరిగినది కావున షెడ్యూల్డు ఆస్తిపై ఎవరైనా ఎటువంటి క్రయ విక్రయాలు జరుపరాదని ఎటువంటి క్రయ విక్రయాలు జరిపినా అవి చెల్లనేరవని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్తి
విశాఖపట్నం జిల్లా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పోరేషన్ పరిధి, సర్వరు సాయిబాబా కాలని, గణేష్ నగర్, మధురవాడ, సర్వే నెం.27/P లో నిర్మించిన RCC రేకు సీటు షెడ్డు ఇంటికి హద్దులు.
తూర్పు : వెంకటరావుకు చెందిన ఇళ్ళు
దక్షిణం : 80 అడుగుల రహదారి
పడమర : సత్యనారాయణ కు చెందిన ఇళ్ళు
ఉత్తరం : కమ్మల ఇళ్ళు.

T. JEEVAN, B.A., L.L.B.
Advocate, Visakhapatnam

IN THE HON' BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT VISAKHAPATNAM
MOP 1279/2012

Between :
KUVVALA SRIKANTH AND OTHERS ...Petitioners
And
P. RAMARAJU AND OTHERS ...Respondents

To
3rd Respondent
Thadi Sankara Rao S/o Veeranna
Driver of Car bearing No.AP 31AD3333
Koruprolu Village
S.Rayavaram Mandal
Visakhapatnam District

NOTICE

Please take notice that the above named petitioner filed the above case before the Hon'ble Court against the respondents grant of compensation of Rs.8,00,000/- (Rupees Eight Lakhs only) for the death of the deceased Ch. Padmarani W/o (late) Nooka Raju in a Motor Accident and the same was posted to **23.02.2018** for your appearance either in person by an authorized representative at **10:30 AM** before the Hon'ble principal District judge at Visakhapatnam, Visakhapatnam district failing which the matter will be decided in your absence.

(As per the order of the Hon'ble Principal District Judge at Visakhapatnam)

K.V. NARAYANA MURTHY
S.S. PATNAIK
Advocates, Visakhapatnam
Ph : 9290465200,9951429292

IN THE HON' BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT VISAKHAPATNAM
MOP 1280/2012

Between :
KUVVALA SRIKANTH AND OTHERS ...Petitioners
And
P. RAMARAJU AND OTHERS ...Respondents

To
3rd Respondent
Thadi Sankara Rao S/o Veeranna
Driver of Car bearing No.AP 31AD3333
Koruprolu Village
S.Rayavaram Mandal
Visakhapatnam District

NOTICE

Please take notice that the above named petitioner filed the above case before the Hon'ble Court against the respondents grant of compensation of Rs.8,00,000/- (Rupees Eight Lakhs only) for the death of the deceased K. Nooka Raju S/o Apparao in a Motor Accident and the same was posted to **23.02.2018** for your appearance either in person by an authorized representative at **10:30 AM** before the Hon'ble principal District judge at Visakhapatnam, Visakhapatnam district failing which the matter will be decided in your absence.

(As per the order of the Hon'ble Principal District Judge at Visakhapatnam)

K.V. NARAYANA MURTHY
S.S. PATNAIK
Advocates, Visakhapatnam
Ph : 9290465200,9951429292

మాట తూలితే..జైలుకే

(మొదటిపేజీ తరువాయి)

(ఐపీసీ) సెక్షన్ 506, 507ల కింద నేరాలకు పాల్పడ్డవారిని అరెస్ట్ చేయాలంటే ముందస్తుగా కోర్టు అనుమతి అవసరం. ఇది చిన్న నేరం (నాన్‌కాగ్నిజబుల్), బెయిలబుల్ కేసు కావడంతో ఎవరైనా ఫిర్యాదు ఇస్తే పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ అరెస్ట్ చేసేవారు కాదు. దర్యాప్తు మాత్రం చేపట్టేవారు. ప్రస్తుతం ఈ సెక్షన్ల సవరణలకు సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి ఆమోదం తెలిపిన సంగతి విదితమే. ఇప్పటివరకు ఇవి చిన్న నేరాలుగా పరిగణనలో ఉండగా వీటిని గుర్తించ దగ్గ నేరాలుగా(కాగ్నిజబుల్) ప్రభుత్వం సవరణలు తీసుకువస్తోంది. గతంలో ఈ సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో మెజిస్ట్రేట్ల అనుమతితోనే దర్యాప్తు, నిందితుల అరెస్టు ఉండేది. తాజా పరిణామాల నేపథ్యంలో.. ఈ కేసుల్లో పోలీసులు మెజిస్ట్రేట్ల నుంచి అనుమతి పొందాల్సిన అవసరముండదు. ఇప్పటి వరకు ఈ సెక్షన్ల కింద నమోదైన నేరాల్లో దర్యాప్తు, అరెస్టుల విషయంలో మెజిస్ట్రేట్ ద్వారా అనుమతి తీసుకునే అంశం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణాధికారంగా ఉండేది. సాధారణంగా దీనిపై ఫిర్యాదు అందితే కవరింగ్ లెటరుతో పోలీసులు సంబంధిత మేజిస్ట్రేట్ ముందుంచి తదుపరి చర్యల నిమిత్తం అనుమతి కోరుతున్నారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు దర్యాప్తు, అరెస్టులు చేపడతారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు విస్తృతమైన నేపథ్యంలో వాటి ద్వారా సెలబ్రిటీలు, రాజకీయ ప్రత్యర్థులు.. వ్యక్తిగతంగా ఇతరులను బెదిరించడం, దూషణలకు పాల్పడటం సర్వసాధారణమైపోయింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ సెక్షన్లను గుర్తించదగ్గ, నాన్‌బెయిలబుల్ నేరాలుగా పరిగణించాలని నిర్ణయించింది.

నేరం కిందికి వచ్చే బెదిరింపును(క్రిమినల్ ఇంటిమిడేషన్) ఐపీసీలోని సెక్షన్ 503 నిర్వచిస్తోంది. ఎవరి వ్యక్తిత్వానికి అయినా హాని చేస్తామని కాని, పరువు లేదా ఆస్తి వ్యవహారంలో నష్టంచేస్తానని భయపెట్టడాన్ని బెదిరింపుగా పరిగణించొచ్చని పేర్కొంది. సాధారణ బెదిరింపునకు పాల్పడితే సెక్షన్ 506 కింది రెండేళ్ల జైలు, జరిమానా, లేదా ఆ రెండు విధించొచ్చని చట్టం చెబుతోంది. ఆ బెదిరింపులు హత్యకు లేదా తీవ్ర గాయాలు, అగ్నికి ఆస్తిని ఆహుతి చేయడానికి దారితీస్తే ఆ వ్యక్తికి ఏడేళ్ల జైలు, లేదా జీవితకారాగారం లేదా మరణశిక్ష విధించొచ్చు. ఐపీసీ సెక్షన్ 507 ప్రకారం అనామక/పేరులేకుండా సమాచారం(సామాజిక మాధ్యమాలు, లేఖలు, ఆకాశరామన్న ఉత్తరాలు, మెయిళ్ళు, ఫోన్ నుంచి బెదిరింపులు, తదితరాలు) వెల్లడి చేయడం ద్వారా బెదిరింపులకు (పరోక్ష) పాల్పడితే రెండేళ్ల వరకు శిక్ష ఉంది. 506 సెక్షన్‌లో పేర్కొన్న అంశాలన్నీ సెక్షన్ 507కు వర్తిస్తాయి. ఈ సెక్షన్లను గుర్తించదగ్గ నేరాలుగా మార్చడం ద్వారా కోర్టు అనుమతి లేకుండా అరెస్టు చేసే అధికారం పోలీసులకు దఖలు పడుతుంది. అయితే పోలీసులు ఈ అధికారాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తీకరించే అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లో కూడా ఇది గుర్తించ దగ్గ నేరంగా పరిగణిస్తూ ప్రభుత్వం 1989లోనే నోటిఫికేషన్ జారీ చేసింది.

అధికారులే దిక్సూచి

(మొదటిపేజీ తరువాయి)

మెంబర్ సర్టిఫికెట్‌ను తహశీల్దార్ ఒక తేదీతో జారీ చేస్తే, దానిపై ఉన్న తేదీలను కృష్ణమూర్తి మార్చేశాడు. తల్లి లేదా తండ్రి చనిపోయిన ఏడాది లోపు మాత్రమే కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ గడువు దాటిపోయాక దరఖాస్తు చేసుకున్నా ఉపయోగం ఉండదు. దీనికి గాను ఎఫ్‌ఎంటీ సర్టిఫికెట్‌పై తేదీలను మార్చేశాడు. అయినా సరే అతనిపై చర్యలు కొరవడలేదు. పైగా ఆ ఎఫ్‌ఎంటీ సర్టిఫికెట్‌కు హెచ్‌బి కాలనీ 9వ వార్డులో జీవీఎంసీ బిల్ కలెక్టర్‌గా పని చేసే శ్రీనివాసరావు అనే వ్యక్తి హామీ కూడా ఉన్నాడు. కృష్ణమూర్తి తప్పులకు జీవీఎంసీ ఉద్యోగులు ఎలా సహకరిస్తున్నారనేది దీనిని చూస్తే తెలిసిపోతుంది. అసలు కృష్ణమూర్తిపై వారికి ఎందుకంత మమకారమో కూడా అర్థం కావడం లేదు. వాస్తవానికి ఇప్పటి వరకు జరిగినవన్నీ క్రిమినల్ చర్యలే. తప్పుడు ధృవపత్రాలతో ఉద్యోగానికి అర్జీ చేసినందుకు గాను జీవీఎంసీ అధికారులే అతనిపై కేసులు పెట్టాలి. కానీ వారంతా అతడితో కుమ్మక్కైన నేపథ్యంలో విషయాలేవీ చాలా రోజులు బయటకు పొక్కలేదు. సహ చట్టం కార్యకర్త త్రిమూర్తి చొరవతో విషయాలు వెలుగులోనికి వచ్చాయి. అలాగే ఈ వ్యవహారంపై సిటీ పోలీస్ కమిషనర్ టి.యోగానంద్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు కూడా త్రిమూర్తి చెబుతున్నారు. పూర్తి ఆధారాలు సమర్పిస్తే సుమోటోగానైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

ఎస్.ఎల్. నెం. 248/2016/సీ.స.3
తేది : 11-02-2018
జిల్లా కలెక్టర్‌వారి కార్యాలయము
విశాఖపట్నం

పత్రికా ప్రకటన

విశాఖపట్నం నగర కాపురస్తులు శ్రీ నాదేండ్ల వెంకటరత్నం తండ్రి జనార్ధనరావు గారు ఈ క్రింది పట్టికలో తెలిపిన భూమికి (NOC) నిరభ్యంతర ధృవీకరణ పత్రము మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామము పేరు	సర్వే నంబరు	విస్తీర్ణము
రేసపువాని పాలెం	17/4C1	610.373 (చ.మీటర్లు)

పైన తెలిపిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన అందిన 15 దినములలోగా శ్రీ జాయింట్ కలెక్టర్ మరియు కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయం, విశాఖపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

సం/- జి.సృజన, జిల్లా జాయింట్ కలెక్టర్
మరియు కాంపిటెంట్ అథారిటీ
అర్బన్ ల్యాండ్ సీలింగ్, విశాఖపట్నం

ఎస్.ఎల్. నెం. 249/2016/సీ.స
తేది : 11-02-2018
జిల్లా కలెక్టర్‌వారి కార్యాలయము
విశాఖపట్నం

పత్రికా ప్రకటన

విశాఖపట్నం నగర కాపురస్తులు శ్రీ నాదేండ్ల వెంకటరత్నం తండ్రి జనార్ధనరావు గారు ఈ క్రింది పట్టికలో తెలిపిన భూమికి (NOC)"నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామము పేరు	సర్వే నంబరు	విస్తీర్ణము
రేసపువాని పాలెం	17/4C1	639.639 (చ.మీటర్లు)

పైన తెలిపిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన అందిన 15 దినములలోగా శ్రీ జాయింట్ కలెక్టర్ మరియు కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయం, విశాఖపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

సం/- జి.సృజన, జిల్లా జాయింట్ కలెక్టర్
మరియు కాంపిటెంట్ అథారిటీ
అర్బన్ ల్యాండ్ సీలింగ్ విభాగము, విశాఖపట్నం

కావలెను
ఎస్.కోట నందు ప్రముఖ ధాబా లో పనిచేయుటకు చైనీస్, తందూరి, నార్త్ ఇండియన్ మాస్టర్లు అనుభవం కలవారు కావలెను.
99499 68519
79955 79121

HOUSE FOR SALE
60 గజములలో ఇండిపెండెంట్ ఇల్లు MRO ఆఫీస్ ఎదురుగా సీతమ్మధార, పోస్ట్ ఆఫీసు దగ్గర, విశాఖపట్నం అమ్మకం.
70938 13394
78010 78360

WATED
FANS, COOLERS, MIXI, MICROOVEN, Repairs చేయుటకు Experienced Field Technicians కావలెను. Two Wheeler Compulsary. Salary up to 12,000/-
ఏదైనా ITI చేసినవారు Helpers కావలెను.
Gajuwaka & Maddilapalem Area వారు కావలెను.
Salary up to 8000/-
98852 13435
70939 40883

PASSPORT MISSING
M. RATNA SUDHAKAR
S/o M.S. Frederick's
Residing at Simhachalam,
Lost my passport
No.P.1731591
while traveling by bike from Simhachalam to port area.
"if anyone found plese intimate."
Address:
100/8,Priyagardens, Simhachalam, Visakhapatnam 530028
94938 87957

బ్యాంక్ గోల్డ్ లోన్స్
❖ అకౌంట్ అవసరం లేదు
❖ అత్యధిక గ్రాము రేటు, అతి తక్కువ వడ్డీ.
❖ మీ బంగారు ఆభరణాలను ఇతర సంస్థల నుండి ఉచితంగా బదిలి చేయబడును
97041 91234

FREE TRAINING&JOBS
అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్
B.COM GRADUATES
ఎస్.సి అభ్యర్థులకు మాత్రమే.
టైలరింగ్
మహిళలకు మాత్రమే.
శిక్షణ ఇచ్చి ఉద్యోగం ఇప్పించబడును.
సూర్య వీర్ ఫ్యాషన్స్,
గుంటూరు సాయి మెస్ పక్కన, శివాలయం వీధి, శంకరమఠం రోడ్, వైజాగ్
98852 13435
70939 40883

సంచలన వార్తాపత్రిక
లీడర్ విశాఖపట్నం సిటీ
విశాఖపట్నం
శుక్రవారం 16-2-2018

26నుంచి వాతావరణ శాఖ క్రీడలు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : భారత వాతావరణ శాఖ జాతీయ క్రీడలు ఈ నెల 26నుంచి మార్చి నెల 1వ తేదీ వరకు విశాఖ వేదికగా నిర్వహిస్తున్నారు. భారత వాతావరణ శాఖ ప్రధాన కార్యాలయంతో పాటు చెన్నై, కోల్‌కతా, ముంబై, నాగ్‌పూర్, గౌహతి, పూణే ప్రాంతీయ కేంద్రాలకు చెందిన 350మంది అధికారుల, సిబ్బంది క్రీడలలో పాల్గొంటారు. క్రికెట్, చెస్, కేరమ్స్, వాలీబాల్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ తదితర పోటీలు పోర్టు స్టేడియంలో జరగనున్నాయి

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చే వరకూ ఉద్యమిస్తాం

ఎస్టీ సాధన సమితి చైర్మన్ నీలకంఠం



హార్బర్ వద్ద దీక్ష చేస్తున్న మత్స్యకార నాయకులు

విశాఖసిటీ, న్యూస్‌లీడర్: మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చేవరకూ పోరాటం ఆపేది లేదని, వివిధ రకాలుగా నిరసనలు తెలుపుటకు మత్స్యకారులంతా ఏకమయ్యారని జిల్లా ఎస్టీ సాధన సమితి చైర్మన్ బుడ్డా నీలకంఠం తెలిపారు. గురువారం జాలారి పేటలో ఎస్టీ సాధనసమితీ అధ్వర్యంలో చైతన్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ వద్ద 50 రోజులుగా మత్స్యకారులు నిరసనలు తెలిపినప్పటికీ ప్రభుత్వం దిగి రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యమ కార్యచరణను మార్చామని, చైతన్య శిబిరాల ద్వారా మత్స్యకారులున్న ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించి, ర్యాలీలు, సభలు ఏర్పాటు చేసి మత్స్యకారుల్ని ఉద్యమంలో పాల్గొనేలా చైతన్యవంతుల్ని చేస్తామన్నారు. తీర ప్రాంతాల్లో వున్న పల్లె గ్రామాల్లో కరపత్రాలు, ప్లకార్డులు, ఫ్లెక్సీలు పంపిణీ చేసి గ్రామస్థాయిలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు ఈ శిబిరాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్, మూగి శ్రీరామమూర్తి, ట్రెజరర్ మూగి రాముడు, అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామారావు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర బీసీ సంఘం సభ్యులు

విశాఖసిటీ, న్యూస్‌లీడర్: రాష్ట్రప్రభుత్వం వెనుకబడినకులాల సంక్షేమానికి ప్రవేశపెట్టిన 110పథకాలపై ప్రతి ఒక్క బీసీ కులస్తుడికి అవగాహన వుండాలని రాష్ట్ర బీసీ సమాఖ్య సంక్షేమ అధ్యక్షుడు దువ్వారపు రామారావు తెలిపారు. గురువారం వీజెఎఫ్ లో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వున్న సుమారు 32 ఉపకులాలతో కలిసి ఈనెల 18తేదీన బుల్లయ్యకళాశాల వద్దనున్న అంబేద్కర్ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అదేరోజు మధ్యాహ్నం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ భవన్ చేరుకుని అనంతరం సభ నిర్వహిస్తామన్నారు. బీసీలకు ప్రభుత్వం విడుదల చేసిన పథకాలు క్షేత్రస్థాయిలో అవగాహన లేక వినియోగించు కోలేకపో తున్నారన్నారు. ఈకార్యక్రమానికి స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులు, ప్రముఖులంతా హాజరై ప్రభుత్వ పథకాలను తెలుపుతారన్నారు. ఈఅవకాశాన్ని బీసీలంతా వినియోగించుకోవాలన్నారు. ఈమీడియా సమావేశం లో రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు తుమ్మిడి. రాంకుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కట్టా.మల్లేశ్వరరావు, బీసీనాయకులు పొన్నాడ. మోహనరావు, అలుబోజు.జగన్నాధం, మదు, రాజారావు, నాయుడు, అప్పారావు, సౌజన్య, ఉమాదేవి, పైడిరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి విరాట్ 2018 సదస్సు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: ఎస్‌బిఎంఎస్, సీఎంటీ, ఎన్‌వీపీ లా కాలేజి సంయుక్త నిర్వహణలో ఈ నెల 16వ తేదీ నుంచి విరాట్ 2018 న్యాయ నిర్వహణ సదస్సు జరుగనుంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను నిర్వాహకులు ఆవిష్కరించారు.వారు అందించిన వివరాల ప్రకారం రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు సుమారు వెయ్యి మంది హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలలకు చెందిన డిగ్రీ, ఇంజనీరింగ్, న్యాయ విద్యార్థులు పాల్గొంటారు. 16వ తేదీన ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏయూ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, శ్రీరాం ప్రాపర్టీస్ సీఈఓ. బాలాజీ హాజరవుతారు. అలాగే అల్వార్స్ ఎడ్యుకేషనల్ గ్రూప్ చైర్మన్ ఎస్.పి. రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సూర్యతేజ, ఎస్‌బిఎంఎస్ కాలేజి డైరెక్టర్ మాధవిలత, ఎన్‌వీపీ లా కాలేజి ప్రొఫెసర్ సి.నిర్మల, విరాట్ కన్వీనర్లు డాక్టర్ జె.ఎన్.శేషుకుమారి, పి. రాజ్యలక్ష్మి పాల్గొంటారు.

365 రోజుల స్వచ్ఛ భారత్
పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ హరిబాబు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ హరిబాబు,

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : గత 365రోజుల నుంచి నిర్విరామంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, జమ్మూఅండ్ కాశ్మీర్, కేరళా, ఒడిశా రాష్ట్రాలలో నిర్వహిస్తు విశాఖ నగరానికి తలమానికంగా నిలుస్తున్న బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు ఆదారి కిషోర్‌కుమార్‌ను విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటి వరకు విశాఖలో ఉన్న విద్యాసంస్థలలోను, ప్రభుత్వ రంగ, ప్రైవేట్ సంస్థలతో పాటు సాంఘీక సంక్షేమ హాస్టల్లలో నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన అన్నారు. ఆదారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే సుమారు 6లక్షల మంది ప్రజలకు అవగాహన కల్పించామని ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళతామని ఆయన అన్నారు. అనంతరం ఎంపీ 365 రోజుల స్వచ్ఛభారత్ పోస్టర్ ఆవిష్కరించారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

ఆనందోబ్రహ్మ యూత్ ట్రస్ట్ చైర్మన్ గోపాలకృష్ణ

విశాఖసిటీ,న్యూస్‌లీడర్: ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతంగా వుండడానికి రోజూ ధ్యానం, యోగా, వ్యాయామం వంటివి చేయాలని ఆరోగ్యంపై పూర్తి అవగాహన కలిగి వుండాలనిఆనందోబ్రహ్మ యూత్‌ట్రస్ట్ చైర్మన్ పిఎస్.గోపాలకృష్ణ తెలిపారు. గురువారం వీజెఎఫ్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు అధ్వర్యంలో ఈనెల 16తేదీనుంచి మూడురోజులపాటు పిఎంపాలెం 3వ బస్ స్టాప్ వద్ద అవాంతి శ్రీనివాస్ ఫంక్షన్ హాలులో శ్రీత్యాగరాజస్వామి ధ్యాన ఆరాధనోత్సవాలను జరుపుతున్నామన్నారు. మూడురోజుల పాటు ఉదయం 10గంటల నుంచి సాయింత్రం 6గంటల వరకు ఉచితధ్యాన ఆరోగ్యశిక్షణా శిభిరం,సాయింత్రం 5గంటలనుంచి రాత్రి 9గంటల వరకూ త్యాగరాజస్వామి పంచరత్నసేవ నిర్వహిస్తున్నామన్నారు. ఈమీడియా సమావేశంలో కనకమహాలక్ష్మీ, ప్రసాద్, రాజ్యలక్ష్మీ, మణికంఠకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉంచాలి : సీపీఐ


అందోళన చేస్తున్న సీపీఐ నేతలు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : బ్యాంకు ఏటీఎంలలో సరిపడ నగదు లేకపోవడంతో విశాఖనగర పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, బ్యాంకు మేనేజర్లను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేసారు. ప్రభుత్వం పెద్దనోట్లను రద్దుచేయడంతో బ్యాంకు అకౌంట్లు తీసి బ్యాంకుల్లో తమ నగదును జమ చేసారు. మున్సిపల్ కార్మికుల దగ్గర నుండి స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి వరకు తమ జీతాలు నేరుగా బ్యాంకుల్లో పడుతున్నాయి. నగదు అవసరమైనప్పుడు తమ ఎటీఎంల ద్వారా విత్‌డ్రాలు ఎక్కువగా చేస్తున్నవారున్నారు. నగరంలో ఉన్న ఏటీఎంలలో నగదు లేక కొన్ని మూతపడ్డాయి. దీంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్ము ఆ ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. లేని పక్షంలో ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు.

గాజువాకలో...

ఉక్కు ఉద్యోగుల సౌకర్యార్థం ఉక్కు టౌన్ షిప్‌లో ఏర్పాటు చేసిన వివిధ బ్యాంకుల్లో వినియోగదారుల అవసరార్థం నగదు లేకుండా బ్యాంక్ అధికారులు చేసారని సీపీఐ ఆధ్వర్యంలో ఉక్కు టౌన్ షిప్ బ్యాకుల వద్ద అందోళన నిర్వహించారు. ప్రధానంగా కార్మికులకు ఉక్కు కర్మాగారం వద్ద నుండ జీతాల రూపంలో వస్తున్న నగదును కార్మికుల అవసరార్థం తీసుకొనేందుకు ఏటీఎంల్లో నగదు కొరత ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల సొంత సంపాదనలో వచ్చిన ధనాన్ని కూడా వాడుకునే విధానానికి వ్యతిరేకంగా పరిపాలన సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసారు. తక్షణమే బ్యాంకుల్లో కార్మికులకు అందుబాట్లలో నగదు నిల్వలు ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉక్కు సిఐటియూ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంతర్ జిల్లా టెన్నీస్ పోటీలకు సర్వం సిద్ధం

ప్రతిభ గల క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో అవకాశం
జిల్లా టెన్నీస్ అసోసియేషన్ కార్యదర్శి వీరమోహన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వీరమోహన్

విశాఖసిటీ,న్యూస్‌లీడర్: నవ్యాంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా విశాఖ కేంద్రంగా అంతర్‌జిల్లాల టెన్నీస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరమోహన్ తెలిపారు. గురువారం ఐటీపీ సెంచరీక్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఈనెల 16తేదీనుంచి మూడురోజుల పాటు అంతర్ జిల్లాల టెన్నీస్ పోటీలు మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభిం చనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరగబోవు ఈపోటీలలో 11జిల్లాల నుంచి 55మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అంతర్ రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామన్నా రు. సెంచరీక్లబ్ ప్రోత్సాహంతో ఈపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు వసతి, భోజన, వాహన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అత్యధిక రేటింగ్ వచ్చిన వారికి మెమొంటో, సర్టిఫికెట్లతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో సెంచరీ క్లబ్ ప్రతినిధులు సురేష్‌బాబు, వెంకటరెడ్డి, జి.మనోహర్, ఏఎస్.ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీడీఆర్ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాస్వామ్యహక్కుల పరి రక్షణే ధ్యేయం
ఓపీడీఆర్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు భాస్కరరావు


గోడపత్రిక విడుదల చేస్తున్న డెమోక్రటిక్ సభ్యులు

విశాఖసిటీ,న్యూస్‌లీడర్: ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణే ధ్యేయంగా అర్గనైజేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమెక్రటిక్ రైట్స్ సంస్థ అధ్వర్యంలో ఈనెల 18తేదీన కడపలో జరగబోయే 17వ రాష్ట్ర మహాసభలను విజయ వంతం చేయవలసిందిగా ఓపీడీఆర్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు భాస్కరరావు తెలిపారు. గురువారం వీజెఎఫ్ లో సంస్థ అధ్వర్యంలో సభకు సంబంధిం చిన కరపత్రం పోస్టర్ ఆవిష్కరణ చేసిన అనంతరం మీడియా సమావే శం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమాన అభివృద్ధి కారణంగా ఐక్యాంధ్రప్రదేశ్ చీలిపోయిందని ఇప్పుడు మరలా ముఖ్యమంత్రి చంద్రబాబు అదే తప్పు చేస్తూ మధ్యాంధ్రప్రదేశ్ అయిన గుం టూరు, విజయవాడలను అభివృద్ధి చేయడం, ఏదో ప్రపంచరాజధాని కట్టేస్తున్నట్లు అభివృద్ధి అంతా ఒక్క చోట చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్రంలో ఇప్పటవరకూ అధికారం చేపట్టిన అన్ని ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడుల మోజులో పారిశ్రామికంగా అభివృద్ధి నేపంతో పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారన్నారు. కేంద్రంలో సంఘ పరివారశక్తులు పనిచేయడంవలన రాజ్యాంగానికి, చట్టానికి వ్యతిరేకంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ మూడు అంశాలపై మహాసభలో ప్రధాన చర్చ జరుగుతోందన్నారు. ఈకార్యక్రమంలో దళితవిముక్తి అధ్యక్షుడు సుర్ల.వెంకటరమణ, ఐఎఫ్‌టియు ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, మహిళాచేతన నాయకురాలు పద్మ, సిఎంఎస్ నాయకురాలు లలిత, ప్రగతిశీల మహిళాసంఘం అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ, భారత నాస్తికసంఘం నాయకుడు నూకరాజు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న 40వ వార్డు అధ్యక్షుడు

ఎన్ఏడీ,న్యూస్‌లీడర్ : స్థానిక జీవీఎంసీ 40వ వార్డు అధ్యక్షుడు వైస్సార్సీపీ వార్డు కార్యలయంలో గురువారం కార్యకర్తల సమక్షంలో పలువురు వృద్ధులకు చీరలు , నిత్యవసర వస్తువులను అందజేశారు . ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా తత్పరత కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు తమకున్న దానిలో కొంత భాగం పేదలకు పెచ్చిస్తే దానిలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు . కార్యక్రమంలో వైకాపా మైనారిటీ నాయకులు షేక్ బాబ్జి , మారే రుషీ , రాగిడి సుశీల , రామరావు , దేవుడు , ప్రసాద్, శాస్త్రి, కృష్ణ, విజయ్, రామలక్ష్మి ,ఆదిలక్ష్మీ స్థానిక మహిళలు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గున్నారు .

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలి

మంత్రి రాజశేఖర్


ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక,న్యూస్‌లీడర్ : విభజన చట్టంలో ఉన్న హామీలను నెరవేర్చడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ గాజువాక ఇన్‌చార్జి మంత్రి రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం గాజువాక తహాశీల్దార్ కార్యాలయం వద్ద గాజువాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉరుకూటి అప్పల నాయుడు అధ్యక్షతన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులగా మంత్రి రాజశేఖర్‌తో పాటుగా రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి గుడివాడ అమ్మన్న, సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జెర్రిపోతుల ముత్యాలు తదితర నాయకులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఉండాలనే ఆలోచనతో పార్లమెంటులో తీర్మానం చేసారని గుర్తు చేసారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న బిజెపి కూడా రాష్ట్రానికి ప్రత్యేక హోదా పదేళ్ల ఉండాలని పట్టుబట్టారని గుర్తు చేసారు. అధికారంలోకి వచ్చిన బిజెపి ఆంధ్ర ప్రదేశ్‌ను చిన్న చూపు చూసిందని తెలిపారు.విశాఖకు రైల్వే జోన్ విశాఖ ప్రజల జన్మహక్కుగా ఉందని దాన్ని అమలు చేయడంలో మీన వేషాలు లెక్కిస్తున్నారని తెలిపారు. విభజన చట్టంలో ఉన్న అంశాలు పూర్తిస్థాయిలో అమలు చేయని కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు త్వరలో బుద్ది చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెలుగు జాతిపై బిజెపి ప్రభుత్వం వివక్ష చూపుతుందని తెలిపారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను అమలు చెయ్యాని తెలిపారు. అనంతరం గాజువాక తాహాశీల్దార్‌గా ఇంచార్జ్ బాద్యతలు తీసుకొన్న చేతన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శవకర్‌నారాయణ, మండపాటి పద్మావతి, మంత్రి మూర్తి, వివిద వార్డులను నుండి కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

టై అమరావతి వర్క్‌షాప్


మాట్లాడుతున్న అభిషేక్ శ్రీవత్సవ

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: నగరంలోని సన్‌రైజ్‌లో గురువారం టై అమరావతి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సదస్సుకు 35స్టార్టప్ కంపెనీల నుంచి 66మంది ప్రతినిధులు హాజరయ్యారు. అంకుర సంస్థలు పెట్టుబడుల సేకరణను ఎలా పెంపొందించుకోవచ్చనే విషయా లపై సదస్సులో చర్చించారు. ఎండియా డైరెక్టర్ అభిషేక్ శ్రీవత్సవ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీ ఎన్నోవేషన్ సొసైటీ సీఈఓ. ప్రొఫెసర్ వల్లీ కుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీఐఎస్ ఈ సరికే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఇన్నుబేషన్ సెంటర్లను నెలకొల్పిందన్నారు. ఏపీని గ్లోబల్ స్టార్టప్ ఎకానమీగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. ఐటీఏఏపీ ప్రెసిడెంట్ రవి ఈశ్వరపు మాట్లాడుతూ వైజాగ్ స్టార్టప్ కంపెనీలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టై అమరావతి బోర్డు డైరెక్టర్లు కృష్ణమూర్తి, మతుకుమిల్లి శ్రీ భరత్, కె. పూర్ణిమ, చిత్తూరి సురేష్, ఆంధ్ర సతీష్, శ్రీను రాజు, బైరపనేని రమేష్, జేపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న ఏసీపీ ప్రభాకర్

ఎన్ఏడీ, న్యూస్‌లీడర్ : స్థానిక జీవీఎంసీ 39వ వార్డు కళింగనగర్‌లో హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో పింఛను దారులకు శిబిరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు . ఈ కార్యక్ర మానికి హాజరైన ట్రాఫిక్ ఏసీపీ కింజారపు ప్రభాకర్ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరము పదవి విరమణ సామాజిక సేవలో ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకం అన్నారు. ప్రజలకు వైద్య సహాయంలో చొరవ చూపించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇండస్ వైద్యశాల వైద్యులు కె శరత్ బాబు , కె శ్రీధర్ ఈ శిబిరంలో బీపీ, షుగర్ ఈసీజీ ,ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు . అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిబిరంలో అధికంగా పెన్షన ర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు

సంచలన వార్తాపత్రిక
లీడర్

ఎడిటోరియల్

పంచాంగం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం శుక్లపక్షం

ఫాల్గుణ శు.పాడ్యమి రా.3:58 వరకు
ధనిష్ట ప.9:30 వరకు
వర్జ్యం సా.5:14 నుండి 6:58 వరకు
దు.ము: ప. 8-40 నుండి 9-35 వరకు
పు.దు.ము: మ. 12-31 నుండి 1-21 వరకు
రా.కా: ప 10-41 నుండి 12-13 వరకు

విశాఖపట్నం

శుక్రవారం 16-2-2018

జలసంపద కీలకం

ప్రజల సంక్షేమం, సమాజ భవిష్యత్తు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. దక్షిణాఫ్రికాలోనే కాదు, ఎక్కడైనా కూడా ఇది వర్తిస్తుంది. వర్షపు నీటిని ఒడి సిపట్టి జలాశయాలలో నిలువ చేసుకోవడం ఎంతో అవసరం. కోట్లాది మంది జనాభాకు ప్రస్తుత అవసరాలు తీర్చడమే కాదు,భవిష్యత్ తరాలకు కూడా కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యూహంతో నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టడం,జలాశయాలు నిర్మించుకోవడం తప్పనిసరి అని అందరూ గ్రహించాలి. దక్షిణాఫ్రికా దేశంలోని కేప్‌టౌన్ నగరం నీటి కొరతను ఎదుర్కొంటున్న తీరు ప్రపంచ దేశాల కు ఒక హెచ్చరిక. మూడేం డ్లుగా తీవ్ర దుర్భిక్షం నెలకొనడంతో, జలాశయ నీళ్ళు అడుగంటాయి. దీంతో కేప్‌టౌన్ నివాసులు రోజు వారీ అవసరాలకు తగినంత నీటిని కూడా పొందలేని దుస్థితి ఏర్పడ్డది. ఈ నేపథ్యంలో జూన్ నెల నుంచి రేషన్ ద్వారా నీటిని తెచ్చుకునే దుస్థితి ఏర్పడుతున్నది. ఇక ఆ రోజు నుంచి నల్లాలలో నీళ్ళు రావు. నగరంలో అక్కడక్కడా నీటి సరఫరా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్నది. పొద్దునే వెళ్ళి క్యూలో నిలబడి నీళ్ళు తెచ్చుకోవలసి వస్తున్న ది. అయినా ప్రభుత్వం మనిషికి రోజుకు 25 లీటర్లు మాత్రమే ఇస్తున్నది. ప్రభుత్వం మొదట ఏప్రిల్ 28ని డే జీరోగా ప్రకటించి, నీటికొరతకు సిద్ధపడమని వెల్లడించింది. దీంతో ప్రజలు అప్రమత్తమై నీటి పొదుపును మొదలుపెట్టారు. వ్యవసాయానికి కూడా నీటి వినియోగం తగ్గించారు. దీంతో స్థానిక ప్రభుత్వం డే జీరోను జూన్ పదకొండుకు జరిపింది. ప్రజల నీటి పొదుపు, లభ్యతలో మార్పు వచ్చే కొద్దీ డే జీరోను అధికారులు ముందుకు వెనక్కు జరుపుతూనే ఉన్నారు. ఇవాళ కేప్‌టౌన్ ఎదుర్కొంటున్న విషమ పరిస్థితి భవిష్యత్తులో ప్రపంచంలోని పలు నగరాలకు తప్పదని అంటున్నారు. బీబీసీ కథనం ప్రకారం కేప్‌టౌన్ తరహాలో లండన్, మాస్కో సహా ప్రపంచంలోని పదకొండు నగరాలు నీటి కొరతను ఎదుర్కోబోతున్నాయి. వీటిలో బ్రెజిల్ ఆర్థిక రాజధాని అయిన సావో పాలో మొదట ఉండగా, బెంగళూరు రెండవ స్థానంలో ఉన్నది. మన దేశంలో బెంగళూరుతో పాటు పలు ప్రాంతాలు నీటికొరతను ఎదుర్కొంటున్నాయి. వెంటనే అప్రమత్తం కాకపోతే ముందు వెనుకగా అన్నిటికీ ఇదే గతి పట్టవచ్చు. ఒకప్పుడు తెలంగాణలో, విదర్భలో కరువు ఎంత విలయాన్ని సృష్టించిందో తెలిసిందే. పశ్చిమ మహారాష్ట్ర నుంచి అదే రాష్ట్రంలోని లాతూరుకు మంచి నీటిని రైలు వాగన్లలో తరలించవలసి వచ్చింది. ఆసియా అభివృద్ధి బ్యాంకు వెల్లడించిన వివరాల ప్రకా రం- భారత్‌లో 2030 నాటికి యాభై శాతం నీటి కొరత ఉంటుంది. బెంగళూరులో 1970 దశకంలో 285 జలాశయాలు ఉంటే, ఇప్పుడు 194కు తగ్గిపోయాయి. కొత్త నిర్మాణాలు చేపడుతున్నా, మంచినీటి, మురికినీటి పారుదల ఏర్పాట్లు తగినట్టుగా లేవు. మంచినీళ్ళలో సగం వృథాగా పోతున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. దేశంలోని మిగతా నగరాల పరిస్థితి ఏమంత గొప్పగా లేదు. అభివృద్ధి పేర ప్రకృతిని ధ్వంసం చేయడం, పర్యావరణానికి హాని కలిగించడం వల్ల ఆ ఫలితాలను అనుభవించవలసి వస్తున్నది. కేప్‌టౌన్ నీటి కరువుకు గురవడానికి కారణం వాతావరణ మార్పు కారణమైనప్పటికీ, సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంటే, ఇంత సంక్షోభం వాటిల్లకు వచ్చి నిలువకపోయేది. దక్షిణాఫ్రికాలోని రాజకీయ నాయకుల సంకుచిత విధానాలు ఈ సంక్షోభా న్ని తెచ్చిపెట్టాయి. కేంద్రంలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ప్రతిపక్ష కూటమి డెమొక్రాటిక్ అలయన్స్ చేతిలో ఉన్నయి. కేప్‌టౌన్ పరిస్థితి దారుణంగా ఉన్నదని, తగు చర్యలు తీసుకోవాలని ఎంత కోరినా కేంద్రం సహకరించలేదు. ఉదాహరణకు- కనీసం ప్రకృతి బీభత్సంగా ప్రకటిస్తే, ఇతర నిధులను నీటి ఏర్పాట్ల వైపు మళ్ళించవచ్చు. ఇటువంటి ఏ విజ్ఞప్తినీ కేంద్రం పట్టించుకోలేదు. చివరికి ఆ ఫలితాన్ని ప్రజలు అనుభవిస్తున్నారు. వర్షపు నీటిని ఒడి సిపట్టి జలాశయాలలో నిలువ చేసుకోవడం ఎంతో అవసరం. కోట్లాది మంది జనాభాకు ప్రస్తుత అవస రాలు తీర్చడమే కాదు, భవిష్యత్ తరాలకు కూడా కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్త లు తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యూహంతో నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టడం, జలాశయాలు నిర్మించుకోవడం తప్పనిసరి అని అం దరూ గ్రహించాలి. తెలంగాణ ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రం లో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతం. కరువు, నీటి కొరత వల్ల మనుషులు, గొడ్డుగోదా మల మల మాడిన రోజులున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం అవత రించిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో చేపడుతున్న మౌలిక చర్యలు గమనార్హమైనవి. వేలాది చెరువుల పునరుద్ధరణ మూలంగా పల్లెలు సస్యశ్యామలం కావడమే కాకుండా, భూగర్భ జలాలు పెరుగుతున్నాయి.

చరిత్రను వక్రీకరించిన మోదీ



ఇటీవల రాజకీయ ఒత్తిడికి గురవుతున్న ప్రధాని మోదీ, ఈ నెల 7న పార్లమెంటులో మాట్లాడుతూ చరి త్రను వక్రీకరించారు.నెహ్రూ ఎట్లా ప్రధాని అయ్యారు, దేశ విభజనకు ఎవరు బాధ్యులు, కశ్మీర్ పట్ల పటేల్ వైఖరి ఏమిటి, దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థ అవ తరణ, ఆంధ్రప్రదేశ్ విభజన తీరు అనే అయిదు అంశా ల్లోనూ ఆయన ఈ విధమైన వక్రీకరణలు చేశారు. ఒత్తిడి పెరిగితే దానిని రాజకీయంగా ఎదుర్కోవాలి. కానీ అందుకు చరిత్రను వక్రీకరించటం వల్ల తనపై గౌరవం తగ్గుతుంది. ఆంధ్రప్రదేశ్ విభజన, తెలంగాణ ఏర్పాటు పట్ల మోదీకి తాను ప్రధాని కాకముందు నుంచి ఉండిన వ్యతిరేకత రహస్యం కాదు. అది ఇపుడు తను ఎదుర్కొంటున్న ఒత్తిడి వల్ల బహుశా తనకు తెలియకుండానే మళ్లీ బయటపడింది. తన వ్యాఖ్యలపై, వాటిలోని లోపాలపై, వాటిలోని లోపాలపై, అవాస్తవికతలపై వివరించి చెప్పుకోవటం కూడా వృథాప్రయాస.

నెహ్రూ నాయకుడు కావటం విషయం ముందు చూద్దాం. మోదీ అన్నట్లు పార్టీ నాయకునిగా నెహ్రూ కన్నా పటేల్‌నే ఎక్కువమంది కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, అన్ని పీసీసీలూ బలపరిచిన మాట నిజం. అయినప్పటికీ వారిని కాదని నెహ్రూ నాయకత్వాన్ని నిర్ణయించింది ఎవరు? ఆ పనిచేసింది స్వయం గా గాంధీయే. అందుకు కారణాలను ఆయనే స్వయంగా చెప్పారు. ఇంగ్లీష్ వారినుంచి మనం అధికారాన్ని స్వీకరిస్తున్న తరుణంలో జవహర్‌లాల్‌కు బదులు మరొకరు ఆ స్థానంలోకి రాలేరని, ఆంగ్లేయులతో వ్యవహరించేందుకు హారో కాలేజీలో, కేంబ్రిడ్జిలో చదివి బారిస్టర్ అయిన నెహ్రూ అందుకు అవసరమని అన్నారాయన. బయటి దేశాల గురించి సర్దార్ కన్నా నెహ్రూకు ఎక్కువ తెలుసని, ముస్లింలతో సత్సంబంధాల కు పటేల్ విముఖుడు కాగా నెహ్రూకు అటువంటి సంబంధాలు ఉన్నాయని, అంతర్జాతీయ వ్యవహారాలు బాగా తెలిసి నందున ఆ స్థాయిలో దేశానికి సముచితమైన స్థానాన్ని సాధించగలదని కూడా అభిప్రాయపడ్డాడు. ఇది కాకుండా, దేశంలోని సాధారణ ప్రజల్లో, ముఖ్యంగా యువతరంలో, పట్టణ వాసులలో, ప్రగతిశీల భావనలు గల వర్గాలలో నెహ్రూకు ఉండిన మద్దతు చాలా ఎక్కువ. ఆ విషయంలో నెహ్రూతో పోటీపడగల ఏకైక వ్యక్తి సుభాష్ బోస్ కాగా ఆయన ఈ సరికి లేరు. వాస్తవానికి గాంధీ అంతకుముందు సంవత్సరాలలో ఒక దశలో తన వారసుడు పటేల్ అని స్పష్టంగా సూచించకుండా వెనుకకుపోవటంలో ఇటువంటి కారణాలు పనిచేశాయి. అప్పటి వివిధ పరిస్థితులు అన్నింటిని దృష్టిలోకి తీసుకుంటూ తన నిర్ణయాన్ని ఆ విధంగా మార్చుకోవటం గాంధీజీ గొప్పతనాన్ని సూచిస్తుంది.

పోతే, పార్టీ నాయకత్వం కోసం నామినేషన్లకు గడువు 1946 ఏప్రిల్ 29 కాగా, ఆ నాటికి నెహ్రూ పేరును ఒక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కూడా ప్రతిపాదించలేదు. రాష్ట్ర కాంగ్రెస్‌లు అన్నీ ఫ్యూడల్, మితవాదవర్గాల ప్రాబల్యంలో ఉండటం అందుకు కారణం. ఆ రోజుకు గాంధీజీ సైతం తన అభిప్రాయం చెప్పలేదు. గడువు ముగిసిపోయినాక కృపలానీ పార్టీ వర్కింగ్ కమిటీకి లేఖ రాస్తూ గాంధీ నెహ్రూకు అనుకూలమంటూ సూచించాడు. దానితో పటేల్ తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. ఈ వివరాలన్నీ అప్పటి చారిత్రక పత్రాలలో ఉన్నవే. ఈ నిర్ణయం సరైనదా కాదా అనే చర్చ ఎంతైనా చేయవచ్చు. కానీ ఆ నిర్ణయం తీసుకున్నది నెహ్రూనో, ఆయన కుటుంబమో కాదు. నిర్ణయానికి గల కారణాలను గాంధీ దాచి ఉంచలేదు. తర్వాత వివరించారు కూడా. అవి ఏమిటో పైన చూశాము. ఆ కారణాలు సహేతుకమో కాదో మోదీ చర్చించవచ్చు. కాని అప్పుడు జరిగిన దానిని అప్పటి పరిస్థితుల నుంచి, గాం ధీ చెప్పిన కారణాల నుంచి విడదీసి ఒకటి రెండు ముక్కలుగా తమకు అనుకూలమైన రీతిలో మాట్లాడటం చరిత్రను పాక్షికం గా చూపటం, వక్రీకరించటం అవుతుంది. పటేల్ తనకు తానే గొప్పవాడు. మన ప్రయోజనాల కోసం ఆయనను మరింత గొప్పవాడిని చేసి ఇతరులను తక్కువచేసే చరిత్ర వక్రీకరణ మాత్రం సరైనది కాదు.

మోదీ ప్రసంగంలో దేశ విభజన అన్నది రెండో అంశం. మీరు (కాంగ్రెస్) దేశాన్ని విభజించినప్పుడు ఎటువంటి విషాన్ని నాటారంటే, ఆ ఫలితాలను 125 కోట్లమంది భారతీయులు అనుభవించకుండా గత డెబ్బై ఏండ్లలో ఒక్కరోజు కూడా గడువలేదు అన్నారు. ఇందులో విషం నాటడం, దాని ఫలితాలు అనే విషయాలను అట్లుంచితే అందుకు ఆరంభం కాంగ్రెస్ దేశాన్ని విభజించటంతో జరిగిందన్నది మోదీ ఎత్తిచూపదలచిన మాట. దేశ విభజన ఒక విషాదకరమైన పరిణామం అనటంలో, అందువల్ల అప్పుడు జరిగిన మారణహోమాన్ని అట్లుంచి దాని దుష్ప్రభావాలు నేటికీ కన్పిస్తున్నాయనటంలో సందేహంలేదు. కాని దేశ విభజనకు బాధ్యత కాంగ్రెస్‌దని మోదీ నిందించదలుచుకుంటే, అదే కాంగ్రెస్‌కు అప్పుడు అగ్రనాయకులలో ఒకరైన పటేల్ పాత్ర కూడా అం దులో ఏమైనా ఉందా అనేది ప్రశ్న. మోదీ మాటలను బట్టి ఆ దోషమంతా తక్కిన కాంగ్రెస్‌ది అన్న అభిప్రాయం కలిగే అవకాశం ఉంది. ఇంత కూ విభజన విషయంలో పటేల్ వైఖరి, పాత్ర ఏమిటి? ఇందుకు సంబంధించి కూడా చారిత్రక పత్రాలు చాలానే ఉన్నాయి.


కశ్మీర్‌కు సంబంధించి సాధారణంగా తెలియని విషయం ఒకటున్నది. అక్కడి పాలకుడు హిందువు అయినా ప్రజలలో అధిక సంఖ్యాకులు ముస్లింలు అయినందున, భారతదేశంలో ఆ సంస్థానం విలీనం పట్ల సర్దార్ పటేల్ మొదటినుంచీ ఆసక్తి చూపలేదు. 1947 ఆగస్టు 15న దేశం స్వతంత్రం కాగలదని ప్రకటించిన బ్రిటిష్ పాలకులు ఇక్కడి సం స్థానాలు ఇండియన్ యూనియన్‌లో, లేదా పాకిస్థాన్‌లో విలీనం కావచ్చునని, లేదా స్వతంత్రంగా ఉండవచ్చునని మూడు ఆప్షన్లు ఇచ్చారు. అందుకు ఆమోదం తెలిపిన భారత నాయకత్వం వీలైనన్ని ఎక్కువ సం స్థానాలను ఆకర్షించేందుకు ప్రయత్నించింది. ఈ ప్రయత్నాలను 1947 మే నుంచే ఆరంభించిన పటేల్, కశ్మీర్‌ను మాత్రం పట్టించుకోలేదు.

ఒకవేళ కశ్మీర్ పాకిస్థాన్‌తో చేరదలచుకుంటే తమకు అభ్యంతరం లేదని పటే ల్ తనకు మాట ఇచ్చినట్లు గవర్నర్ జనరల్ మౌంట్ బాటెన్ జూన్ మూడవవారంలో కశ్మీర్ రాజు హరిసింగ్‌తో చెప్పినట్లు, పటేల్ కార్యద ర్శి మెనన్ స్వయంగా పేర్కొన్నాడు. కశ్మీర్ గురించి ఆలోచించేం దుకు కూడా నాకు సమయం లేదు అని సైతం పటేల్ అన్నట్లు పేర్కొన్నాడు మెనన్. అప్పటి క్యాబినెట్ కార్య దర్శి వి.శంకర్ కూడా ఈ విషయాలు ధృవీకరించాడు. ఆగస్టులో దేశం స్వతంత్రమైన తర్వాత సెప్టెంబర్ 13న కూడా తన వైఖరి అదే అయినట్లు పటేల్ ఆ రోజు ఉదయం రక్షణమంత్రి బల్‌దేవ్‌సింగ్‌కు రాసిన లేఖ స్పష్టం చేస్తున్నది.

ఆ తర్వాత మాత్రమే కొన్ని ఇతర పరిణామాల వల్ల పటేల్ వైఖరి మారింది. కాని అప్పటికే కశ్మీర్ చేజారటం మొదలైంది. యుద్ధం పట్ల ఆయన ఉత్సాహమైతే చూపారు గాని, కశ్మీర్‌లో ఒక భాగం పాకిస్థాన్ అధీనంలోకి ఆ సరికే వెళ్లి పోయింది. పటేల్‌ను పొగిడిన మోదీ ఈ చరిత్రనంతా తేలికగా విస్మరించారు.

బుద్ధుడు సందేశాలు

సృష్టించిన వాని అధికారానికి లోబడాలి



"విశ్వాన్ని పాలించే చక్రవర్తి ప్రథమ తనయుడిలా ధర్మ చక్ర పరివర్తనలో ప్రభువుకు ముఖ్యనుచరుడై సారి పుత్రుడు సాయపడతాడు."
మగధ రాజ్యంలో శిష్టులైన యువకులలో అనేకులు బుద్ధునిచే ప్రభావితులై ఆధ్యాత్మిక జీవితం గడపటం గమనించిన ప్రజలు అందోళన చెందారు. ఆగ్రహంతో ఇలా గొణగసాగారు: ఈ శాక్యముని వల్ల మగవాళ్ళు పెళ్ళాం పిల్లల్ని వదిలి వెళ్ళిపోతున్నారు. కుటుంబాలు కూలిపోతున్నాయి. ఇదంతా బుద్ధుని చలవే అని ఈసడించుకోసాగారు. భిక్షువులను చూచినప్పుడల్లా తిట్టిపోయడం మొదలుపెట్టారు. రాజగృహంలో మనుష్యుల మనస్సులను పాడుచేయడానికే ఈ శాక్యముని వచ్చాడు. ఇంకా ఎందరిని తప్పుదారి పట్టిస్తాడో, అని అనేవారు. భిక్షువులు ఈ మాటలను బుద్ధుడికి చెప్పారు. బుద్ధుడిలా అన్నాడు: "భిక్షువులారా! విచారించకండి. ఈ సణుగుడు కొద్దికాలమే ఉంటుంది. వారం దినాలు ఓపిక పట్టండి, అంతా సర్దుకొంటుంది. మిమ్మల్ని తిట్టినట్ల యితే ఇలా సమాధానం చెప్పండి. "తథాగ తులు సత్యాన్ని ప్రవచించడం ద్వారా ప్రజలను సన్మార్గంలో పెడతారు. ధర్మాత్ములను, జ్ఞానుల ను ఎవరైనా నిందిస్తారా? సణుగుతారా? ఆత్మ సంయమనం, ధర్మాచరణ, దయాగుణం - వీటిని విమర్శిస్తారా? ఇవే గదా బుద్ధుడు బోధి స్తున్నది." ఆపైన బుద్ధుడు ఒక పద్యాన్ని చెప్పాడు.

తప్పులు చేయకు, ఒప్పులు చేయుట ఏమరకు
నిర్మల కాసారం చేసుకో నీ హృదయం
ఇదే బుద్ధులు చెప్పే పరమ సత్యం

అంతం కలకాలం మన్నే తిరుగులేని నిజం

ఆ సమయంలో అనంతమైన సంపదగల అనాథ రాజగృహాన్ని సందర్శిస్తూ, బుద్ధుడు అవతరించాడని, సమీపంలోని వనంలో విడిది చేశాడని విని, ఆ పురుషోత్తముని చూడ్డానికి ఆ రాత్రే బయలుదేరాడు. అతడు వదాన్యుడు, దానశీలి, పేదలకు ఆప్త మిత్రుడు, దిక్కులేని అనాథలకు తోడు నీడ. అందుకే అతనికి అనాథ పిండకుడని పేరు వచ్చింది. అతడిని చూడగానే అతడి ఉదార హృదయాన్ని గుర్తించి బుద్ధుడు ఆశీర్వదించాడు. తన దగ్గర కూర్చోబెట్టుకొని ఇలా ఉపదేశించాడు. అత్రుత, ఆరాటం, అశాంతి ఇదీ లోకం తీరు. మన బాధలన్నిటికి ఇదే కారణం.మనస్థితం వల్ల అమృతత్వపు ప్రశాంతి లభిస్తుంది. అహంకారమనేది మిశ్రగుణాల మనం ఊహించుకొనే సృష్టికర్త అయిన ఈశ్వరుడా? ఈశ్వరుడే కర్త అయితే, జీవ కోటి అంతా మరోమాట లేకుండా తమను సృష్టించిన వాని అధికారానికి లోబడాలి.

దిన ఫలాలు

శుక్రవారం -16-2-2018

మేషం: నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఆర్థికలావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. స్పెక్యులేషన్ లాభదాయకంగా ఉంటుంది. శుభవార్తలు అందుకుంటారు.

వృషభం: ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. బంధువుల రాకతో ఉత్సాహం చోటు చేసుకుంటుంది. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

మిథునం: నిరుద్యోగులలో ఉత్సాహం చోటు చేసుకుంటుంది. భాగస్వామిక చర్చలు వాయిదా పడతాయి. కీలకమైన విషయాల్లో అప్రమత్తంగా ఉండాలి.

కర్కాటకం: ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగులు పదోన్నతులు లాంటి శుభవార్తలు వింటారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. కుటుంబ పట్ల అనురాగం పెంపొందుతుంది.

సింహం: కొత్త ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. కుటుంబ సభ్యులతో విభేదాలు తలెత్తే ఆస్కారం ఉంది. ఖర్చులు అధికమవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు.

కన్య: కుటుంబ సభ్యుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. రుణ విముక్తి కావడంతో మానసికంగా కుదుటపడతారు. వృత్తి వ్యాపారుల లాభసాటిగా సాగుతాయి.

తుల: ప్రయాణాలు సాఫీగా సాగుతాయి. కీలక సమయంలో మిత్రుల సాయం అందుతుంది. మొండి బాకీలు వసూలవుతాయి. నిరుద్యోగులు లభించిన అవకాశాలను వినియోగించుకోవాలి

వృశ్చికం: వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటారు. తీరికలేని పనులతో అసహనానికి గురవుతారు. ఒప్పందాలు, హామీల విషయంలో లౌక్యంగా వ్యవహరించాలి.

ధనస్సు: ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. అనుకున్న లక్ష్యాలను సాధిస్తారు. ముఖ్యమైన వారి కోసం ధనం వెచ్చిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తికరంగా సాగుతాయి.

మకరం: వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది. గృహనిర్మాణ ఆలోచనలు బలపడతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

కుంభం: శ్రీమతి సలహా పాటించి లబ్ధి పొందుతారు. మిత్రుల వైఖరి నిరుత్సాహం కలిగిస్తుంది. అతిథులను ఆకట్టుకుంటారు. కాంట్రాక్టర్లకు సమస్యలు తలెత్తుతాయి.

మీనం: మహిళ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఆర్థిక లావాదేవీలు అనుకూలిస్తాయి. ముఖ్యమైన వ్యవ హారాల్లో కీలకపాత్ర పోషిస్తారు. అధికారులతో చేత మాటపడక తప్పదు.

ఆరోగ్యం



పుదీనాతో ఆరోగ్య సమస్యలు దూరం

చాలా మంది పుదీనాను నిత్యం పలు వంటకాల్లో వేస్తుంటారు. ఇది ఘాటైన తాజా వాసనను కలిగి ఉంటుంది. దీంతో పుదీనా వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే రుచి, వాసనలకే కాదు, ఔషధ గుణాలకు కూడా పుదీనా పెట్టింది పేరు. ఇందులో ఉండే ఔషధ కారకాలు మనకు ఎంతో మేలు కలిగిస్తాయి. పలు అనారోగ్య సమస్యలను నయం చేస్తాయి. ఈ క్రమంలో పుదీనాతో ఎలాంటి అనా రోగ్యాలను దూరం చేసుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.

1. పుదీనా ఆకులను వేసి కాచిన టీని తాగితే జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలు పోతాయి.

2. పుదీనా ఆకులను మెత్తగా నలిపి మిశ్రమంగా చేసి దాంతో పళ్ళ తోముకుంటే మిల మిల మెరుస్తాయి.

3. చర్మంపై ఎక్కడైనా దురదగా, మంటగా ఉంటే కొన్ని పుదీనా ఆకులను నలిపి ఆయా ప్రదేశాలపై ఉంచితే ఆ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.


4. పుదీనా ఆకుల రసం, నిమ్మరసం, తేనెలను ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని అన్నింటినీ బాగా కలిపి తీసుకుంటే అజీర్ణం, కడుపు ఉబ్బరం, వికారం, వాంతులు తగ్గుతాయి.

5. పుదీనా ఆకులను బాగా నలిపి ముద్దగా చేసి దాన్ని నుదుటిపై ఉంచితే తలనొప్పి ఇట్టే తగ్గిపోతుంది.

6. పుదీనా ఆకులతో కాచిన కషాయంలో ఉప్పు కలిపి పుక్కిలిస్తే గొంతు నొప్పి సమస్య తొలగిపోతుంది. దంత సంబంధ వ్యాధులకు కూడా ఈ మిశ్రమాన్ని వాడవచ్చు.

7. పుదీనా ఆకుల్ని మెత్తగా పేస్ట్ చేసి అందులో కొంత పసుపు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసి 15 నిమిషాల తరువాత ముఖం కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం సౌందర్యాన్ని సంతరించుకుంటుంది. చర్మం మృదువుగా మారుతుంది.


చరిత్రలో ఫిబ్రవరి 16



1954 : వెస్ట్‌ఇండీస్ కు చెందిన ప్రముఖ మజీ క్రికెట్ క్రీడాకారుడు మైకెల్ హోల్డింగ్ జననం.
1956 : భారతదేశానికి చెందిన సుప్రసిద్ధ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా మరణం (జ.1893).
1961 : ఆర్థిక శాస్త్రవేత్త మరియు విశ్వవిద్యాలయ సంచాలకులు వాసిరెడ్డి శ్రీకృష్ణ మరణం (జ.1902).
1964 : పారిశ్రామికవేత్త మరియు భారత పార్లమెంటు సభ్యుడు లగడపాటి రాజగోపాల్ జననం.
1985 : తెలుగునాట ప్రముఖ పాత్రికేయులు మరియు రచయిత నార్ల వెంకటేశ్వరరావు మరణం (జ.1908).
2005 : ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో మొదలైన క్యోటో ఒప్పందం అమలయింది.
1944 : భారతీయ చలనచిత్ర పితామహుడిగా పేరు గాంచిన దాదాసాహెబ్ ఫాల్కే మరణం (జ.1870). ఒక అంకిత స్వభావుడి అరుదైన కృషి, జిజ్ఞాసల ఫలితంగా ఎనిమిది దశాబ్దాల క్రితం భారతదేశంలో చలన చిత్ర రంగం ఆవిష్కారమైనది. వెండి తెరపై భారతీయ దేవుళ్ళను చూడాలనే స్వప్నం కళ్లెదురుగా కదలాడింది. అనాడు బైస్కోపులు అమెరికా, ఇతర నాగరిక పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి అయ్యేవి. చెక్కబొమ్మలు చెక్కేవారు. సంగీతం, చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ, మాజిక్, మౌల్డింగ్ వంటి అనేక రంగాలలో ఆరితేరినవాడై స్వాప్నికుడిగా మారిన ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే భారతీయ చలన చిత్ర పితామహుడు కాగలిగాడు. దాదా సాహెబ్ ఫాల్కేగా గణుతికెక్కాడు " (ఏప్రిల్ 30, 1870 - ఫిబ్రవరి 16, 1944) ఒక భారతీయ సినీ నిర్మాత, దర్శకుడు, స్క్రీన్‌ప్లే-రచయిత, భారతీయ సినిమా పితామహుడు అని కూడా ప్రసిద్ధి. ఇతడి ప్రథమ సినిమా రాజా హరిశ్చంద్ర (భారతీయ మొదటి సినిమా) 1913. ఇతడు తన జీవితంలో 95 ఫీచర్ ఫిల్మ్‌లు, నిర్మించాడు. ధుండీరాజ్ గోవింద్ ఫాల్కే మహారాష్ట్ర సమీప త్రయంబకేశ్వర్ లో 1870 ఏప్రిల్ 30 న జన్మించాడు. ఫాల్కె తండ్రితో ఉద్యోగ నిమిత్తం బొంబాయి చేరాడు. కళాత్మక అభిరుచి ఉండటంతో 1885 లో జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరాడు.
చిత్రలేఖనం నేర్చుకున్నాడు. బరో డాలోని ప్రఖ్యాత "కళాభవన్"లో ఫోటోగ్రఫీ, మౌల్డింగ్, ఆర్కిటెక్చర్ వంటి అనేక కళలనే కాక మాజిక్ విద్యను కూడా నేర్చుకున్నాడు. ప్రారంభ దశలో డ్రామా కంపె నీల నిమిత్తం ఒక ఫోటోగ్రఫర్ గా, సీన్ పెయింటర్ గా జీవితాన్ని మలుచుకున్నాడు.

శ్రీవేంకటేశ్వర వైభవము

భగవంతునికి బంధువు ఎవరో తెలుసా?



అట్టి అవసరమైన సౌలభ్యము పూర్వము చెప్పిన నాలుగు ప్రాకారములగు పర, వ్యూహ, విభవ, అన్తర్యామి స్వరూపములయందు దేశవిప్రకర్షచేతను, కాలవిప్రకర్షచేతను, ఇంద్రియవిప్రకర్షచేతను లేకయున్నది. అటుల నాలుగు ప్రకారములయందు లేని సౌలభ్య ము అయిదవది. యగు అర్చావతారమునందు గిరి నగర్ గ్రామ గృహాదులయందధివసించియుండు కారణముచేత అడ్డులేక పరిపూర్ణముగానున్నది. "అర్చావతార స్సర్వేషాం బాంధవో బంధువత్సలః" అను ప్రమా ణము అర్చావతారః (జగత్స్వామి అవతారము) అని స్వామిత్వమును, సర్వేషాం బాంధవః (తరతమ భావములేక అందరికి బంధువు) అని సౌశీల్యమును, బంధువత్సలః (బంధువులయందు వాత్సల్యము కలవాడు) అని వాత్సల్యమును చెప్పుచున్నది. భగవంతునికి బంధువనగా భగవతీర్థ ప్రసాదముల ననుదినము అనుభవించుచు ఆశ్రయించియుండువాడు అని యజుర్వేద బ్రాహ్మణము చెప్పుచున్నది.

"తదస్య ప్రియ మభి పాథో అశ్యా
న్నరో యత్రదేవయవో మదన్తి
ఉరుక్రమస్య స హి బన్ధు రిత్థా
విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః"

తా॥ దేవారాధకులు ఏ భగవత్తీర్థ ప్రసాదములయందు సంతుష్టులగు చున్నారో ఆ భగవత్తీర్థ ప్రసాదములను అనుదినము అనుభవించుచు భగవంతుని ఆశ్రయించి యుండువాడు భగవంతునకు బంధువగుచున్నాడు. పరమపదమునందాసక్తి కలవాడగుచున్నాడు.

అందుచే ఆశ్రితులు పరమేశ్వరుడు నాశ్రయించుటకు వలయు కళ్యాణగుణములన్నియు అర్చావతారమున ప్రకాశించుచున్నవి.

మరియు అర్చావతారమున వేంచేసియున్న పరమేశ్వరుడు అజ్ఞునివలె, అశక్తునివలె, అపూర్ణునివలె,అధీ నునివలెకనుపించు చున్నాడు కాని సర్వజ్ఞుడు, సర్వశక్తుడు, అవాప్తసమస్తకాముడు, నిరుపాధిక సర్వశేషియగుటవలన నిరవధిక కారుణ్య ప్రవాహముచేత ఆశ్రితులకు యథాధికారముగ నేత్ర పుత్ర, కళత్రే, క్షేత్రాది మోక్షపర్యంతములగు సమస్త వాంఛితములను ఇచ్చుచున్నాడు.

ఈ అర్చాస్వరూపము 1.స్వయంవ్యక్తము, 2. దివ్యము, 3. సైద్ధము, 4. మానుషము అను నాలుగు తెరంగులుగానున్నది.

1. స్వయంవ్యక్తము : అనగా స్వయముగా వ్యక్తీభవించిన అర్చాస్వరూపము.
2. దివ్యము: అనగా దేవతలచేత ప్రతిష్ఠింపబడిన అర్చాస్వరూపము.
3. సైద్ధము : అనగా యోగసంసిద్ధులచేత ప్రతిష్ఠింపబడిన అర్చాస్వరూపము. ఈ స్వరూపములు పురాణాదులయందు తెలియదగియున్నవి.
4. మానుషము: అనగా మనుష్యులచే ప్రతిష్ఠింపబడిన అర్చాస్వరూపము. స్పష్టము.

ఆర్షము-మహర్షులచేత ప్రతిష్ఠింపబడిన అర్చాస్వరూపము అయిదవదిగా నున్నదని కొందరు, పూర్వోక్తములలోనే అన్తర్భావమని కొందరు అభిప్రాయపడుచున్నారు.

ఈ అర్చాస్వరూపములలో స్వయం వ్యక్తార్చాస్వరూపము బహుతరశక్తియుక్తమై ప్రకాశించుచున్నది. అట్టి స్వయం వ్యక్తార్చాస్వరూపములలో అగ్ర స్థానమునలంకరించి బ్రహ్మాండమునందు అద్వితీయముగా ప్రకావించుచున్న వారు శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామివారు.

ఇట్లు పురాణములచే ప్రబోధింపబడుటయేగాక వేలాది మానవులచే నాశ్రయింపబడుచు నేత్ర, పుత్ర, కళత్రాది సర్వవరములను దయాపారవశ్యముచే దానముచేయుచూ తామ్రశకలాది రత్నాన్తములగు దక్షిణలను అతివాత్సల్యముచే అతి ప్రేమదచే స్వీకరించుచు శేషశైలశిఖరాగ్రమునందు ఆనందనిలయములో పద్మపీఠమున మన్దస్మితముగా వేంచేసియున్నారు.

ఇది భారతీయుల మహా అదృష్టము.

పై తెల్పిన ఈ అంశములను, శ్రీస్వామివారి వైభవములను వరాహపురాణము, పద్మపురాణము, గరుడపురాణము, మార్కండేయ పురాణము, వామనపురాణము, బ్రహ్మపురాణము, భవిష్యోత్తరపురాణము, ఆదిత్యపురాణము, స్కందపురాణము, స్కాందపురాణము, బ్రహ్మాణ్డపురాణము ఈ మొదలగు పురాణములు, వేదములు, శాస్త్రములు చెప్పుచున్నవి.

శ్రీ వైకుంఠమునందు శ్రియఃపతియగు శ్రీమన్నారాయణుని దర్శనము చేయుచూ నిత్యులగువారలు ముక్తులగువారలు అందరు.

సంచలన వార్తాపత్రిక
లీడర్

ఘనంగా పోతురాజుబాబు పండగ

రోలుగుంట, న్యూస్‌లీడర్: మండలం కొండపాలెం గ్రామంలో గురువారం పోతురాజుబాబు పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. గ్రామంలో విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. నిర్వాహకుడు మాజీ సర్పంచ్ బంటు రమణ ఆధ్వర్యంలో పండుగ జరిగింది. ఉదయం నుంచి భక్తులు భారీ ఎత్తున పోతురాజుబాబులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 7 గంటలకు డాన్స్‌బేబీ డాన్స్ వలు ఇతర కార్యక్రమాలు జరిగాయి. లక్ష్మీనరసింహ సాంఘిక నాటకం ప్రదర్శన అలంరించింది.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి జాతర



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పీలా



అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: స్థానిక విజయరామరాజుపేటలో గురువారం మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా స్థానిక శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, డైట్ కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, డాక్టర్ కె. విష్ణుమూర్తి, డాక్టర్ కేవీ సత్యవతిలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ముఖ్యఅతిథులు ఎమ్మెల్యే పీలా, మాజీ మంత్రి దాడి, డైట్ కరస్పాండెంట్ రత్నాకర్‌లను ఆలయ కమిటీ ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. అలాగే టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవం సందర్భంగా విజయరామరాజుపేటలోని ప్రధాన రహదారులతో పాటు అన్ని వీధుల్లోను విద్యుత్ తోరణాలతో అలంకరణ చేశారు. ప్రధానజంక్షన్ వద్ద భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి సెట్టింగ్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. టాలీవుడ్, బాలీవుడ్ మ్యూజిక్ కంపోజర్ సంగీత దర్శకుడు రవిశంకర్ ఆధ్వర్యంలో పట్నాల శంకర్‌రావు దుకాణం వద్ద సినీ మ్యూజికల్ నైట్‌ను ఏర్పాటు చేశారు. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీధి పెద్దలు ఆళ్ల సూర్య రామకృష్ణ, బొట్టానాయుడు, పిట్లా బుద్దేసు, పలకా రాము, పలకా సత్యనారాయణ, కుందల రామకృష్ణ, ఆళ్ల రామచంద్రరావు, యల్లంకి సత్తిబాబు, పలకా రవి తదితరులు ఉన్నారు.





మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, డైట్ కరస్పాండెంట్ దాడి రత్నాకర్

8న రైల్వే ఉద్యోగాల పరీక్షలకు ఉచిత అవగాహన సదస్సు



అనకాపల్లి, న్యూస్‌లీడర్: ఆర్ఆర్‌బి (రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు)-ఏఎల్‌పీ, టెక్నీషియన్లు, గ్రూపు-డి పోస్టు లకు జరుగు పోటీ పరీక్షలకు ఉచిత అవగాహన సదస్సు ఈ నెల 18న ఆదివారం ఉదయం 9 గంటలకు అనకాపల్లి లోని శ్రీ గౌరీ గంథాలయంలో జరుగుతుందని గ్రంథాల యం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, ప్రొగ్రాం కన్వీనర్ మళ్ల బాపునాయుడు సంయుక్త ప్రకటనలో తెలి పారు. 75 ఏ ళ్ల ఘన చరిత్ర కలిగి ఎంతో మందికి విజ్ఞా నాన్ని అందిస్తూ ఉపాధి శిక్షణా కేంద్రంగా పేరొందిన శ్రీ గౌరీ గ్రంథాయం ఆధ్వర్యంలో వరుణ్ స్టడీ సెంటర్ (విశాఖ పట్నం) సహకారంతో ఈ సదస్సు జరుగుతుందన్నారు. సదస్సులో రీజనింగ్, అర్థమెటిక్, జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్, జనరల్ సైన్స్, ట్రేడ్ సబ్జెక్టులు మొదలగు అంశాల గురించి ప్రాథమిక సమాచారం వివరిం చడం జరుగుతుందన్నారు. గత పోటీ పరీక్షల 'కొన్ని' ప్రశ్నాపత్రాలు ఉచితంగా అందజేస్తామన్నారు. సద స్సుకు విశిష్ట అతిథులుగా వరుణ్ స్టడీ సెంటర్ డైరక్టర్, జనరల్ అవేర్‌నెస్ లెజండ్, పి.అప్పలనాయుడు, పోటీ పరీక్షల శిక్షకులు కె.రాజేష్, వెంకటేష్ హాజరవుతారు. త్వరలో 91,502 వివిధ స్థాయిల రైల్వే ఉద్యోగాలను కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయనున్న నేపథ్యంలో పోటీ పరీక్షలకు నిరుద్యోగులంతా సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. నిరుద్యోగులంతా అవగాహన సదస్సు కు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. వివరాలకు 92471 87355, 92471 66511లను సంప్రదించా లని ఆ ప్రకటనలో వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వృథాగా ఏలేరు కాలువ నీరు



రోడ్డుపై పారుతున్న ఏలేరుకాలువ నీరు

కశింకోట, న్యూస్‌లీడర్: కశింకోట మండలంలో అచ్చెర్ల, మోసయ్యపేట, సింగవరం వెళ్లే రోడ్డుపై నుంచి ఏలేరు కాలువ నీరు వృథాగా పోతుంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే ఏలేరు కాలువ నీరు రైతులు కొంత మంది వ్యవసాయానికి గండి కొడుతున్నారని, దాని వలన నీరు వృథాగా పోతుందని, రైతులు మోటార్ల ద్వారా ఇబ్బందులు ఉండవని , ఇలా వృథాగా పోవడం వలన ప్లాంట్‌కు నీరు చాలడంలేదని, ఈ సమస్య పరిష్కరించాలంటే ఏలేరు కాలువ నీటిని వారం రోజు నిలుపుదల చేస్తేనే కాని ఈ సమస్య పరిష్కారం కాదని డీఈ మురళీకృష్ణ తెలిపారు. ఒకవేళ కాలువ నీరు వారం రోజులు నిలుపుదల చేస్తే రోజుకు రూ.10కోట్లు ప్లాంట్‌కు నష్టం వాటిల్లుతుందన్నారు. కాలువ నీరు నిలుపుదల చేయడం సాధ్యం కాదన్నారు. దీని సమస్య పరిష్కారానికి ఒక టీమ్‌ను వేశామని త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఏలేరు కాలువకి రైతులు గండి కొడుతున్నారని అధికారులు చెప్పిన మాటలు అవాస్తవమని, నీరు వృథాగా పోవడంతో రైతుల పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో ఏ వ్యవసాయం పెట్టుకోవడానికి అవకాశంలేదని వాపోతున్నారు. కాలువ నీరు మామిడివాడ గెడ్డకు పోతుందని, ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మోదమాంబ కాలనీలో బహిరంగ మలమూత్ర విసర్జన అరికట్టండి



మోదమాంబకాలనీ రహదారి

మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగుల మోదమాంబ కాలనీ, సాగరం వెళ్లే దారి కింద లైన్‌లో బీసీ గర్ల్స్ వసతి గృహం ఎదురుగా తెల్లవారు జామున, రాత్రి వేళ కొంత మంది వ్యక్తులు బహిరంగ మలమూత్ర విసర్జన చేయ డంతో దారిన నడిచేవారు తీవ్ర దుర్వాసన కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా మాడుగుల సర్పంచ్ దంగేటి వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి చదరం రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంతంలో బహిరంగ మలమూత్ర విసర్జన అరికట్టగలిగారు. అలాగే మోదమాంబ కాలనీలో కూడా పంచాయతీ వారు మలమూత్ర విసర్జనను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మాడుగులలో చెరకు తోట దగ్ధం



చెరకుతోట దగ్ధం

మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగుల తాచేరు నది సమీపంలో తూరుబిల్లి శ్రీనుకు చెందిన చెరకుతోట కాలిబూడి"దైంది. మోదమాంబ కాలనీకి చెందిన తూరుబిల్లి శ్రీను పొలంలో కర్రి అప్పలనా యుడు అనే రైతు చెరకుతోట వేసి పంటను పండిస్తున్నారు. హఠాత్తుగా మంటలు చెలరేగి చెరకుతోట పూర్తిగా దగ్ధమైంది. సుమారు 50వేల రూపాయలు నష్టం వాటిల్లిందని తూరుబిల్లి శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు.

గ్యాస్‌పైపు పాయింట్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన జేసీ సృజన



వాడ్రాపల్లిలో రైతులతో మాట్లాడుతున్న జేసీ సృజన

మార్కెట్ ధర కంటే మూడురెట్లు ఇవ్వాలని జేసీని కోరిన రైతులు

మునగపాక, న్యూస్‌లీడర్: మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలోగల సర్వేనెంబర్ 522లో ఎకరా60సెంట్ల స్థలంలో గ్యాస్ పైపులైన పాయింట్ ఏర్పాటు చేసేందుకు గతంలో నిర్ణయించారు. ఈ మేరకు ఈ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ సృజన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూములు ఇచ్చిన రైతులు మాట్లాడుతూ ఇక్కడ స్థలాన్ని మూడేళ్ల కిందటే తీసుకోవడం జరిగిందని అయితే అప్పటి భూమి ధరకు ఇప్పటికి ధరలకు వ్యత్యాసం ఉన్నందుకు తమకు మూడురెట్లు పరిహారం వచ్చేలా చూడాలని జేసీని కోరారు. అలాగే ఈ స్థలాన్ని ఆనుకొని ఉన్న సుమారు 30 సెంట్లుగల భూమినికూడా తీసుకోవాలని పలువురు రైతులు జేసీని కోరారు. దీనికి ఆమె మాట్లాడుతూ ఎంత అవసరమైతే అంత మాత్రమే తీసుకోవడం జరుగుతుందని, భవిష్యత్‌లో అవసరమైతే తీసుకొని అవకాశం ఉందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ వర్థన్, తహసీల్దార్ రాంబాబు, మండల సర్వేయర్ శ్రీనివాస్, మళ్ల వరహా నర్సింగరావు, కొయిలాడ దశావతారం, కాండ్రేగుల నూకరాజు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్శిటీ త్వైకాండో పోటీలకు దివ్య



దివ్యను అభినందిస్తున్న విజయబాబు, సందీప్

ఎలమంచిలి, న్యూస్‌లీడర్: త్వైకాండో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు మండలంలోని సోమలింగపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని ఎస్.దివ్య ఎంపికైంది. గత నెల 23వ తేదీన విశాఖ పట్నం ఆంధ్రా యూనివర్శిటీలో జరిగిన ఎంపిక పోటీలలో 53 నుంచి 57 కిలోల కేటగిరిలో గోల్డ్‌మెడల్ పొంది ఈ నెల 18, 19, 20, 21 తేదీల్లో పంజాబ్‌లోని అమృతసర్ జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీలలో పాల్గొనడా నికి అర్హత సాధించిందని జిల్లా ఆటల పోటీల యాజ మాన్యంకు చెందిన కోచ్ ఎస్‌వీఎస్ రమేష్ ఎలమం చిలికి చెందిన దివ్య ఎంపికైనట్లు తెలిపారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన దివ్యని మండల పరిషత్ అధ్యక్షు లు ముఖ్య సలహాదారు, ఆత్మ ఛైర్మన్ కె.విజయబాబు, మండల అభివృద్ధి అధికారి సందీప్ అభినందించారు.

అనకాపల్లికి ఫిల్మ్ హిస్టోరియన్ వి.ఏ.కె.రంగారావు రాక



వి.ఏ.కె.రంగారావు

అనకాపల్లి, న్యూస్‌లీడర్: బహు ముఖ ప్రజ్ఞాశాలి, ప్రసిద్ధ రచయిత, సినీ, కళా, నాట్య, సంగీత, శిల్ప, సాహిత్య, విమర్శకులు, ఫిల్మ్ హిస్టోరియన్, సినీ పరిశ్రమ తొలి పీఆర్‌వో వి.ఏ.కె.రంగారావు శుక్రవారం సాయంత్రం 3-30 గంటలకు 75 ఏ ళ్ల ఘన చరిత్ర కలిగి ఎంతో మందికి విజ్ఞానాన్ని అందిస్తూ ఉపాధిని కల్పిస్తూ ఈ-గ్రంథా లయంగా తీర్చిదిద్దబడిన శ్రీ గౌరీ గ్రంథాలయాన్ని సందర్శించనున్నారు. 1904 నుంచి 1973 వరకు సినీ పరిశ్రమ గ్రామ ఫోన్ 78 ఆర్‌ఆర్‌పీ 52,000 రికార్డులను సేకరించి ఈయన భారతదేశంలోనే గుర్తింపు పొందారు. గ్రామ ఫోన్ రికార్డుల్లో లక్షా 50 వేలకు బగా పాటలున్నాయి.

1973 తర్వాత ఈయన వద్ద నగు మోము రికార్డులు కూడా ఉన్నాయి. ఈ సంద ర్భంగా 'సినీ, కళా, నాట్య, సంగీత, రచయిత, శిల్ప, సాహిత్యం' అంశాలపై ఆత్మీయ సమావేశం జరుగుతుందని గ్రంథాలయ కార్య దర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటన లో తెలిపారు. కార్యక్రమానికి ఆసక్తిఉన్నవారంతా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పరీక్ష కేంద్రాని ఎత్తివేసినందుకు నిరసన



అనంతగిరి : అనంతగిరి ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఎత్తివేసినంద కుగాను నిరసనగా మండల కేంద్రంలో ఆర్‌ఐవో దిష్టిబొమ్మను విద్యా ర్థులు తగులబెట్టారు. అనంతగిరి పరీక్ష కేంద్రంలో చూసిరాతలు జరు గుతున్నా దాఖలాలు లేవని. ఆ సాకుతో కేంద్రన్ని ఎత్తి వేయడం సమంజసం కాదని అన్నారు. ఒక గిరిజన అధికారి అయి ఉండి గిరిజనులు విద్యార్థులు కష్టాలు తెలుసుకోక పోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగులు, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సేవ చేయడమే జీవిత లక్ష్యం



అధ్యాత్మిక సేవా కార్యక్రమంలో పాల్గొన్న పదాల అప్పారావు

పడాల అప్పారావు

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: స్థానిక లక్ష్మీదేవిపేట పాత్రుడుకాలనీ, మిరియాలకాలనీ భక్తుల అభిమానంతో నిర్మించిన థాట్స్ ఆఫ్ లివింగ్ ఆత్మజ్ఞాన యోగాశ్రమం నందు ఉచిత వైద్యశిబిరాలు, అధ్యాత్మికసేవలు, భక్తుల నులకు మాలాధరణ చేసి భక్తులకు శివారాధన చేయించే పలు కార్య క్రమాలు చేపట్టడం జరుగుతుందని రాజర్షి ఆత్మానందస్వామి పదాల అప్పా రావు తెలిపారు. ప్రతి సోమవారం ఆల యానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో శివమాలధారణ చేసే భక్తులకు, అయ్యప్ప, దుర్గాదేవి, నూకాం బిక అమ్మవారు తదితర మాలధారణ చేసే భక్తులకు కూడా అన్నదానం కార్యక్రమాలను నిర్వహించాలని సంకల్పిం చడం జరుగుతుందని పదాల అప్పారావు అన్నారు.

ఆర్ఈసీఎస్ అభివృద్ధికి కృషి

ఛైర్మన్ మలసాల రమణారావు



మాట్లాడుతున్న ఛైర్మన్ రమణారావు

కశింకోట, న్యూస్‌లీడర్: కశింకోట ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గ ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ఈసీఎస్ ఛైర్మన్ మలసాల రమణారావు పాల్గొని గ్రామాలలో సమస్యలను సర్పంచులను అడిగి తెలుసుకున్నారు. మార్టూరు గ్రామంలో ఆరు స్టోన్ క్రషర్లు ఉన్నాయని, వాటికి కరెంటు సప్లై పూర్తిగా అందడంలేదని ఈ సమస్య పరిష్కరించలేదని ఛైర్మన్‌ని తెలిపారు. ఛైర్మన్ రమణారావు మాట్లాడుతూ ఆర్ఈ సీఎస్ పరిధిలో తాను ఉన్నంత కాలం అధికారులు గాని, లైన్లు సంస్థకు చెడ్డపేరు తేవాలని ప్రయత్నిస్తే ఉపేక్షించేదిలేదని, ఏదైన సమస్యలుంటే తనకు నేరుగా తెలియపరిస్తే ఈ సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సబ్సిడీ కరెంటు కూడా ఇస్తున్నామని, దానిని వినియోగించు కోవాలన్నారు. ఆర్ఈసీఎస్ మరింత అభివృద్ధి చెందడానికి అందరూ సహకరించా లన్నారు. గ్రామాల్లో లైన్‌మేన్లు, హెల్పర్లు వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ ఎండీ శ్రీనివాసరాజు, ప్రాజెక్టు ఇంజనీర్ జె.ప్రసాద్, సిదిరెడ్డి శ్రీనివాసరావు, గంగుపాం నాగేశ్వరరావు, వేగి గోపీకృష్ణ, అకిరెడ్డి రాము, చవితిన శ్రీనివాసరావు, వేగి వెంకటరావు, మలసాల కుమారరాజా, అనకాపల్లి పార్టీ అధ్యక్షుడు పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గౌరీ పంచాయతన దేవాలయంలో 119 ఊంజల్‌సేవ

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: గవరపాలెం సిదానందొడ్డి శ్రీ గౌరీ పంచాయతన దేవాలయం నందు శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ఊంజల్‌సేవ కార్యక్రమాన్ని కొణతాల జగ్గఅప్పలస్వామి ఆశీస్సులతో కీర్తిశేషులు కెఓఎస్ఎస్‌వి అప్పారావు (శివాజీ కుమారులు) కొణతాల శివకుమార్, వెంకటలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించబడునని ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తోలేటి బుచ్చిబాబు ఆధ్వర్యంలో శ్రీ గురు వెంకట అమృతవర్షిణి అనకాపల్లి వారిచే భక్తరంజని శ్రీ విక్రమవర్మ శిష్యబృందం, శ్రీవాసవి బాలవిహార్, శివ నృత్యానికేతన్ అనకాపల్లి వారిచే నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా శ్రీ గౌరీపరమేశ్వరి అమృతవర్షిణి, శ్రీ గౌరీ గీత మహిళా సంఘం , శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి సభ్యులు పాల్గొంటారని కర్రిసన్యాసినాయుడు తెలిపారు. పై కార్యక్రమాలకు భక్తలందరూ విచ్చేసి గౌరీ పరమేశ్వరులకు జరిగే ఊంజల్‌సేవ కార్యక్రమంలో పాల్గొవాలని ఆయన కోరారు.

కుపైట్లో ఉద్యోగాలకు దరఖాస్తులు ..

ఎస్ఏడీ, న్యూస్‌లీడర్: ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఓం క్యాంప్)నేతృత్వంలో కువైట్లో ఉద్యోగాలకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఉపాధి అధికారి (క్లరికల్) ఈ వెంకటరత్నం తెలిపారు .పెంట గ్లోబల్ ఇంజనీరింగ్ కంపెనీలో ఫిట్టర్స్ ,పైపింగ్ సూపర్ వైజర్, హెల్పర్స్, స్కార్ఫ్ హోల్డర్స్ ,గో లెండర్స్ ,ప్లేట్ వెల్డర్స్, కాంబో వెల్డర్స్ ఉద్యోగాలకు నియామకాలు ఉంటాయన్నారు. విద్యార్హత జీతము తదితర వివరాల కోసం అభ్యర్థులు www.omc.ap.gov.in వెబ్సైట్లో తెలుసుకోవచ్చని సూచించారు అరత అనుభవాన్ని బట్టి ఆయా ఉద్యోగాలకు జీతము నెలకు 20 వేల నుంచి రూ 1.15 లక్షల వరకు ఉంటుందన్నారు ఆసక్తి ఉన్నవారు పాసుపోర్టు కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను resumeomcap@ gmail.comకు మేలు చేయాలన్నారు అభ్యర్థుల వివరాల ఆధారంగా ప్రాథమిక ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఎంపిక ప్రక్రియ విశాఖపట్నం ,రాజమండ్రి విజయవాడల్లో, జరుగుతాయన్నారు .మరిన్ని వివరాలకు 7674047499 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలన్నారు .

శివరాత్రికి ఆర్టీసీ ఆదాయం రూ. 5 లక్షల 56వేలు

అనకాపల్లి డిపో మేనేజర్ ప్రవీణ

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అనకాపల్లి ఆర్టీసీ డిపో నుంచి కల్యాణిలోవకు 35 స్పెషల్ బస్సులను నడపగా నాలుగు లక్షల 70వేల రూపాయలు ఆదాయం సమకూరిందని ఆర్టీసీ డిఎం ప్రవీణ తెలిపారు. అదేవిధంగా పుణ్యగిరికి 11 బస్సులను నడపగా ఒక లక్ష 56వేల రూపాయలు ఆదాయం సమకూరినట్లుగా ఆమె తెలిపారు. గత ఏడాది కల్యాణిలోవకు స్పెషల్ బస్సులు ద్వారా నాలుగు లక్షల 50వేల రూపాయలు, పుణ్యగిరికి లక్షా 29వేల రూపాయలు ఆదాయం సమకూరిందని ఆమె తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది స్పెషల్ బస్సులను నడపడం వలన కొంతమేర ఆదాయం పెరిగిందని డిఎం ప్రవీణ న్యూస్‌లీడర్‌కు గురువారం తెలిపారు.

కె.జె.పురం పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ కృషి



మరుగుదొడ్ల నిర్మాణం

మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగుల మండలం కె.జె.పురం పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా సర్పంచ్ పెంటకోట అప్పారావు కృషి చేస్తున్నారు. ఏ పంచాయతీలో లేని విధంగా ఒకేచోట 140 మరుగుదొడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. నెహ్రూ వీధిలో 60, వడ్రపేటలో 40, హైస్కూల్ వద్ద 40 మరుగు దొడ్లు నిర్మిస్తున్నారు. గ్రామంలో వీధులను శుభ్రపరచడానికి ట్రాక్టర్ కొనుగోలు చేసి ఎప్ప టికప్పుడు వీధులను శుభ్రం చేస్తు న్నారు. అన్ని వీధుల్లో సుమారు కోటి రూపాయల నిధులతో సీసీ రోడ్లు నిర్మించారు. ఇంకా కొన్ని సీసీ రోడ్లు నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మాడుగుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గవిరెడ్డి రామానాయుడు ఏర్పాటు చేసిన నిధుల ద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషి ఫలితంగా కె.జె.పురంలో విద్యుత్ సమస్య లేకుండా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. మెయిన్‌రోడ్డులో రామాల యంనకు ఎదురుగా అవంతి కళాక్షేత్రం నిర్మించారు. విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు నిధులతో కె.జె.పురం జంక్షన్‌లో మినీ సోలార్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో రెండు అంగన్‌వాడీ భవనాలను ఏర్పాటు చేశారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య లేకుండా గెడ్డ బ్రిడ్జి నుంచి మరిడిమాంబ పాదాలు వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీ సభ్యులు శరగడం శ్రీను, నందం శ్రీను, ఆళ్ల సుశీల, సూరిశెట్టి పైడితల్లమ్మ, వేగి భవాని, కొయిలాడ కొండమ్మ, భూపతి నాగమణి, పీలా సుభ ద్రమ్మ, కొయిలాడ సుబ్బలక్ష్మి, కె.వి.ఎస్. అప్పారావు, కాళ్ల కోటి, మద్దాల ప్రసాద్, ఆదారి మహాలక్ష్మినాయుడు, పరిమి మల్లికార్జునరావు, వీరందరి సహకారంతో గ్రామపెద్దలు , యువకులు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి గ్రామాభివృద్ధికి సహకరించారని పెంటకోట అప్పారావు తెలిపారు.



పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు సహాయ సహకారాలం దించడంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడం జరిగింది.

-పెంటకోట అప్పారావు, సర్పంచ్, కె.జె.పురం



కె.జె.పురం గ్రామాభివృద్ధి కి సర్పంచ్ అప్పారావు చేస్తున్న కృషి అభినం దనీయం. గతంలో కన్నా పంచాయతీ బాగా అభివృద్ధి చెందింది.

-యల్లపు శ్రీనివాసరావు, పాలసంఘం అధ్యక్షుడు, కె.జె.పురం

మాదిగలకు రూ.3వేలు పింఛన్ అందించాలి

అనకాపల్లి, న్యూస్‌లీడర్: ఎస్సీ కులాల్లో అట్టడుగున ఉన్న జాతి మాదిగలకు మూడువేల రూపాయలు పింఛన్ ఇప్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పట్టణ శాఖ అధ్యక్షులు కట్టమూరి మంగరాజు కోరారు. గురువారం జరిగిన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలకు, దాని ఉప కులాలు చెందిన ప్రజలు విద్యా, ఉపాధి విషయంలో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ఈ ఆధునిక ప్రపంచంలో మాదిగలు నేటికీ రోడ్డు ప్రక్కన చెప్పుకుట్టుకొని, డప్పులు కొట్టుకొని కనీస దినసరి కూలి కూడా పొందలేకపోతున్నారన్నారు. నేటి పరిస్థితులను బట్టి వీరికి నెలకు మూడు వేల రూపాయలు పింఛను పథకం అమలు చేసి ప్రభుత్వం అందించాలని ఆయన కోరారు. వారి పిల్లలకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించాలి, ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని అప్పుడే వారు అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి అర్హులైన మాదిగ గృహిణులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని మంగరాజు కోరారు. సమావేశంలో కనకరాజు, కమల్, రవిబాబు, అప్పారావు, కొండలరావు, నాగేశ్వరరావు, నాగరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్

పేదలకు బట్టలు పంపిణీ

బొబ్బిలి,న్యూస్‌లీడర్ : పట్టణంలో తారకరామ కాలనీకి చెందిన అలజంగి సాయి ప్రథ‌మ వర్ధంతి సందర్భంగా అతని తల్లిదండ్రులు అలజంగి కన్నారావు, గౌరి దంప తులు పేద వృద్ధులకు అభాగ్యులకు 100 మందికి బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో వార్డు కౌన్సిలర్ రామవరపు కళ్యాణి మడక అప్పారావు, వాడపల్లి మనోజ్, అలజంగి గోపి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నౌకలు, జలంతార్గముల రీఫిట్‌పై సమీక్ష



మాట్లాడుతున్న వైస్ అడ్మిరల్ పాటీ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : భారత నౌకాదళంలోని నౌకలు, జలంతార్గముల, వాటి సామర్థ్యం, రీఫిట్ చేయాల్సిన అవశ్యకత, మౌళిక వసతులపై విశాఖపట్నం తూర్పు నౌకదళంలో రెండు రోజుల సమీక్ష సమావేశం జరిగింది. తూర్పు నౌకాదళం అధిపతి వైస్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ ప్రారంభించినఈ సమీక్ష సమావేశానికి కేంద్ర రక్షణ శాఖ మెటీరియల్ చీఫ్ వైస్ అడ్మిరల్ జీఎస్ పాటీ అధ్యక్షత వహించారు. మూడు దళాలకు చెందిన ప్రతినిధులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. వార్షిక నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

పునరావాస కాలనీలో స్వచ్ఛభారత్



వార్డుల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపడుతున్న దృశ్యం

గాజువాక, న్యూస్‌లీడర్: జీవీఎంసీ అగనంపూడి 56,57వ వార్డుల పునరావాస కాలనీలు శానిటరీ సిబ్బందితో కాలనీ ప్రతినిధులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా వీధులు తుడుస్తూ తడి-పొడి చెత్తను వేరు చేస్తు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 2018 స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 500 పట్టణాల, నగరాల మధ్య ఈ పోటీ కలిగి ఉందని, ఏపీ రాష్ట్రాలు స్వచ్ఛసర్వేక్షణ ఫీడ్ బ్యాక్‌లో విశాఖనగరం 72 వేల మందితో అత్యధికంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బి. అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుద్ధ మహాలక్ష్మి నాయుడు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయం పునఃనిర్మాణం



బొబ్బిలి,న్యూస్‌లీడర్ : మండలంలోని జగన్నాథపురంలో రామాలయం నిర్మాణం చురుగ్గా జరుగుతుంది. గ్రామంలో పురాతన రామాలయం ఉండడంతో అది శిథిలం కావడం వల్ల గ్రామస్థులు తొలగించి దాని స్థానంలో పునర్నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యు లు రౌతు రామమూర్తినాయుడు, తెంటు కృష్ణమూర్తినాయు డు, తెంటు అప్పలనాయుడు, సర్పంచ్ కనిమెరక రమణ మూర్తి, ఉరిటి సూర్యనారాయణ, తెంటు రామినా యుడు, తోట తిరుపతి, గ్రామస్తులు సహాయ సహకారాలతో రామాల యం చాలా అందంగా నిర్మిణం చేపట్టారు. దాదాపు ఆలయ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఆలయం నిర్మాణం పునర్నిర్మాణం చేపట్టడం గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక హోదా పోరాటానికే మా మద్దతు



విలేకరుల సమావేశంలో మాట్లాడున్న తాడి అచ్చారావు

వేపాడ, న్యూస్‌లీడర్ : రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యేక హెూదా కోసం పోరాటం చేసిన వారికే మా మద్దతు ఉంటుం దని ఏపీ దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడి అచ్చారావు వెల్లడించారు. రాష్ట్ర విభజన కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగాలంటే హెూదాయే దోహదపడుతుందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రంలోని విపక్షాలు, ప్రజా సం ఘాలన్నీ ఒక త్రాటిపై నిలిచిపోరాటం చేస్తే తాము కూడా మద్దతునిస్తామని తాడి ప్రకటించారు. ఈ సమావేశంలో మాలమహానాడు కార్యదర్శి వై.మరియదాసు, ఎం.అప్పలరా జు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కలప రవాణా పట్టించుకోని అధికారులు

వేపాడ: వేపాడ మండలంలో పోతుబంది పాలెం, వెంకయ్యపాలెం చామలాపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో నిత్యం అక్రమ కలప రవాణా జరగడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అక్రమ కలప రవాణా దారులు అధికారులకు చూపిస్తున్న అనుమతులకు రవాణా చేస్తున్న కలపకు పొంతన ఉండదు. ఇదంతా చూస్తే తప్పనిసరిగా రెవిన్యూ అధికారులకు తెలిసే వ్యాపారస్తులు రవాణా చేస్తున్నారన్న వాదన బలంగా నమ్మవచ్చు. కరకవలస రెవిన్యూ పరిధిలో గల రియల్ వ్యాపారి నందన వందనం అనే లేఅవుట్‌లో ఏవిధమైన అనుమతులు లేకుండా చెట్లు నరికి వేసారని ఆర్‌టిఐ చట్టం ద్వారా పక్కా సమాచారము కూడా తెలిపారు. ఈ మధ్యకాలంలో దబ్బిరాజుపేట స్మశానం వద్ద అనుమతులు లేకుండా ఎదురు బొంగులు సుమారు 500 వరకు గుట్ట వేసిన విషయం రెవిన్యూ అధికారులకు తెలిసినా ఏవిధమైన చర్యలు చేపట్టలేదు. నిల్వ ఉంచిన ఎదురురు బొంగులు రాత్రికి రాత్రే మాయమైపోయాయి. పచ్చదనం పరిరక్షించే అధికారులే అక్రమార్కులకు సహకరిస్తుంటే అక్రమాలకు పాల్పడేవారు ఎవరు బాధ్యత వహిస్తారంటున్నారు గ్రామంలో పలువురు ప్రజలు.

కొత్తపల్లి మాట!.. టీడీపీకి క్లారిటీ లేదు!



విజయనగరం,న్యూస్‌లీడర్ కొత్తపల్లి గీత... గడచిన సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ జిల్లా అరకు లోక్ సభ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఫస్ట్ టైం ఎంపీగా ఎన్నికైన మహిళా నేత. అయితే 2014 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ అధికారంలోకి రాకపోయే సరికి ఫ్లేట్ ఫిరాయించేసిన గీత టీడీపీకి దగ్గరగా జరిగారు. అయితే ఇప్పటిదాకా టీడీపీలో చేరినట్లుగా ఎక్కడ కూడా ప్రకటన చేయకుండా చాలా జాగ్రత్తగానే మెయింటైన్ చేసుకుంటూ వస్తున్న గీత ఇప్పుడు దాదాపుగా యూటర్న్ తీసుకున్నట్లుగా కనిపిస్తున్నారు. మొన్న కేంద్ర బడ్జెట్ లో ఏపీకి కేటాయింపులేమీ లేని నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ సర్కారుపై టీడీపీ ఒంటికాలిపై లేచిన వైనంపై రంగంలోకి దిగేసిన కొత్తపల్లి గీత తనదైన స్టైల్లో వైసీపీతో పాటుగా టీడీపీని ఉతికి ఆరేశారనే చెప్పాలి. మొత్తంగా వైసీపీ తరఫున ఎంపీగా గెలిచిన గీత టీడీపీకి దగ్గరగా జరిగి కూడా ఆ పార్టీలో చేరకుండా ఇప్పుడు కొత్తగా బీజేపీ పంచన చేరిపోతున్నట్లుగా వార్తా కథనాలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో ఏపీకి న్యాయం అన్యాయంపై బీజేపీ టీడీపీ మధ్య మాటల యుద్ధం జరుగుతుంటే దానిలోకి కూడా ఎంట్రీ ఇచ్చిన గీత టీడీపీని కోలుకోలేని దెబ్బ కొట్టేశారని చెప్పక తప్పదు. అసలు ఏపీకి న్యాయం చేయమని కేంద్రాన్ని ఏం అడగాలో కూడా టీడీపీకి అర్థం కావడం లేదన్న మాట వినిపించిన గీత టీడీపీకి పెద్ద షాకే ఇచ్చారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధుల విషయంలో టీడీపీకి స్పష్టత లేదని ఆమె వ్యాఖ్యానించారు. రాజకీయాలకు అతీతంగా అంతా రాష్ట్రం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ఎంత నిధులు వచ్చాయో కేంద్రం నుంచి స్పష్టత రావాల్సి ఉందన్నారు. రాజకీయ అవసరాల కోసం కాకుండా రాష్ట్రం కోసం పోరాడాలని ప్రజల్ని నష్టపరచకుండా నాయకులు వ్యవహరించాలని సూచించారు. రైల్వేజోన్ విశాఖకు రావాలని అది విశాఖ ప్రజల హక్కు అని కూడా ఆమె వ్యాఖ్యానించారు. విజయవాడకు ఎయిమ్స్ రావడం వల్ల ఉత్తరాంధ్రకు నష్టం జరుగుతుందని చెప్పిన గీత అన్ని సంస్థలు విజయవాడ - అమరావతికే వెళ్తున్నాయని ఉత్తరాంధ్రకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల నష్టం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. మొత్తంగా తనదైన శైలి కామెంట్లతో టీడీపీకి పంటి కింద నలుసులాగే గీత వ్యవహరిస్తున్నారని చెప్పక తప్పదేమో.

మాతా శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: రక్తహీనత వలన మాతా శిశు మరణాలు సంభవించకుండా తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలసిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో మాతృ మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల ద్వారా మంచి పౌష్టికాహారం, ఉచిత వైద్య సౌకర్యాలు, మందుల పంపిణీ చేయడం జరుగుతుందని, ఎక్కువగా ఏజెన్సీ ప్రాంత మండలాలలో రక్తహీనత వలన మాతృమరణాలు నమోదవుతున్నాయని, అవి సంభ విం చకుండా ప్రజలలో అవగా హన కలిగించడం ద్వారా ఆసుపత్రి ప్రసవా లను ప్రోత్స హించాల న్నారు. ఆశా, అంగన్‌వాడీ, ఎఎన్‌ఎంలు ఎప్పటి కప్పుడు పర్యటిస్తూ గర్భిణీల ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ వారికి అవసరమైన బీపీ, హిమోగ్లోబిన్ పరీక్ష‌లను నిర్వహించి ఐరన్ ట్యాబ్లెట్ లను పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రమేష్, జాయింట్ కలెక్టర్ -2 డా.సిరి, జిల్లా వైద్యాధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఐరా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

టెక్కలి, న్యూస్‌లీడర్ : శ్రీకాకుళం జిల్లాలోని కొంత మంది పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం పాత్రికేయులకు మూడు పడకల గదుల నిర్మాణం చేపడతాము అనడంతో గతంలో ఇల్ల స్థలాలు లేని విలేకర్లు తో కలసి అఖిల భారత జర్నలిస్టు అసోసియేషన్ , ఏపియుడబ్ల్యూజేఎఫ్ సంఘాలు పలాస మండల తహశీల్దారు కళ్యాణ చక్రవర్తికి పాత్రికేయుల ఇళ్ల స్థాలలకోసం వినతి పత్రం అందించారు. ఈ సందర్భ‌ముగా మండల తహశీల్దారు మాట్లాడుతూ నివేదిక తయారు చేసి పై అధికారులకు పంపిస్తానని. అన్నారు. ఐరా జిల్లా ఇన్చార్జ్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆనందరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో శ్రమిస్తున్న పాత్రికేయులు ఎంతో శ్రమిస్తున్నారని. అలాంటి పాత్రికేయులను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ సమస్యలు తీర్చడం లేదని. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగులో ఉన్న పాత్రికేయుల ఇల్ల స్థలాలను పాత్రికేయులకు ఇప్పిస్తూ, ఇళ్లస్థలాలు లేనివారికి స్థలాలు మంజూరు చేయాలని కోరామని అన్నారు. పాత్రికేయులకు ఐరా తోడుగా ఉండి సమస్యలపై పోరాటం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐరా ఉత్తరాంధ్ర సెక్రటరీ జి.బోస్,కె.రవి, పి.రత్నాకర్, కె.క్రిషా?రావు, బి.లోకనాథం, జయంత్ కుమార్, కుమార్,లతో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవయ్య జయంతి వేడుకలు



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం,న్యూస్‌లీడర్ : తొలి దళిత ముఖ్యమంత్రి శ్రీ.శే. దామోదరం సంజీవయ్య 97వ జయంతి కార్యక్రమం బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి డిపార్ట్‌మెంట్ చైర్మన్ బొంగ భానుమూర్తి అధ్యక్షతన జరిగింది. ముందుగా దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యర్ర ఆదిరాజు మాట్లాడుతూ తొలి దళిత కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డిగ్రీ, పిజీ విద్యార్థులకు నగదు పురస్కారాలు



విజయనగరం, న్యూస్‌లీడర్ విజయనగరం పట్టణం తోటపాలెంలో గల సత్య డిగ్రీ, పిజీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాశ నిపుణులు, లీగల్, హెచ్‌ఆర్ కన్సల్టెన్, ట్రైనర్ బేతా సురేష్ అందజేసారు. ఇటీవల మరణించిన తన తండ్రి, విద్యావేత్త బేతా లక్ష్మీ నరసింగరావు జ్ఞాపకార్థం నగదు పురస్కారాలను బి.కాం. చదువుతున్న విద్యార్థులకు తన తండ్రి పేరున నగదు పురస్కారాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం పీజీ కాలేజిలో సెమినార్ హాల్‌కు బేతా లక్ష్మీ నరసింగరావు నామకరణం చేసి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డా॥ ఎం. శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ డా॥ ఎం.వి.సాయిదేవమణి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.సత్యవేణి, ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యత, అంటరానితంపై ఎంవీజీఆర్ అవగాహన



అవగాహన కల్పిస్తున్న దవ్వు శ్రీను

విజయనగరం,న్యూస్‌లీడర్ : మహారాజ విజయరామ గజపతి కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం దత్తత గ్రామం బొద్దవలస గ్రామ పంచాయితీలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ మూడవ రోజు సందర్భంగా సమాజిక చైతన్యంలో భాగంగా నిరక్షరా స్యత. అంటరానితనం సామాజిక రుగ్మతలు మీద ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు గ్రామంలో ప్రజలతో ముఖాముఖీ ప్రసంగి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు పాల్గొన్న గురజాడ కళాశాల విద్యాసంస్థల చైర్మన్ కృష్ణజీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు దవ్వు శ్రీనులు పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఏవిధంగా ఉపయోగ పడుతుందో, విద్యార్థులు ఎంత కృషి చేస్తున్నారో దాని వాల్ల గ్రామనికి కాక విద్యార్థి దశలో ఏవిధంగా పరిపక్వత చెందుతుందో అని ప్రసంగించి వివరించారు. ఈ కార్యక్ర మాన్ని ఎంవిజిఆర్ కళాశాల ప్రధాన ఆచార్యులు డా.కె. వి.ఎల్.రాజు, సంపూర్ణ సహాయసహకారాలు అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎం.లక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఓ డా.సర్వారావు, అసోసియేషన్ ఆచార్యులు పి.శ్రీనివాసరావు, సహాయ ఆచార్యులు ఇ.కళ్యాణ్, కె.అచ్యుత్‌వర్ధన్ పాల్గొన్నారు.

18న తెలుగుభాషా సేవా పురస్కార ప్రధానోత్సవం

విజయనగరం, న్యూస్‌లీడర్ ఎలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 105, గీతాంజలి విద్యాసంస్థలు, తెలుగు నాడు డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు పోలీస్ శిక్షణా కళాశాలలో ప్రిన్సిపల్ కె.రాజశిఖామణి సహకారంతో తెలుగు భాషా సేవా పురస్కార ప్రదానోత్సవం జరుగనుందని ఎలయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ గురుప్రసాద్ అన్నారు. బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుండి 150 మంది ఈ అవార్డుకోసం దరఖాస్తు చేసుకోగా 30 మందిని ఎంపిక చేసామని, వివిధ కళాశాలల తెలుగు విభాగపు అధిపతులతో పాటు, ప్రముఖ రచయితలు, రచయిత్రులు ఈ అవార్డును అందుకోనున్నారని అన్నారు. కార్యక్రమంలో తొలుత పిటిసి ప్రిన్సిపల్ కె.రాజశిఖామణి సంబంధిత ఆహ్వానప్రతులను ఆవిష్కరించి మాట్లాడుతూ తెలుగు భాష వికాసం కోసం అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఒంగోలు పోలీస్‌శిక్షణా కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.డెల్లీ, డిఎస్పీ ప్రవీణ్‌కుమార్, తల్లిక్లబ్ అధ్యక్షులు పిన్నింటి సూర్యనారాయణ, వనితాక్లబ్ అధ్యక్షురాలు సుభద్రాదేవి, తెలుగునాడు డెవలప్‌మెంట్ ఫోరమ్ అధ్యక్షులు విమలారాణి, గీతాంజలి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యల పరిష్కారానికి కృషి



వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ సమస్యల న్నింటినీ 30 రోజుల్లోగా పరిష్కరిస్తానని జాయింట్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) విశాఖపట్నం జిల్లా కమిటీ నాయకత్వానికి హామీ ఇచ్చారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏపీ జీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా నాయకత్వం జాయింట్ డైరెక్టంకు ధర్నా నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఏపీజీ ఎల్‌కు సంబంధించి దీర్ఘకాలిక సమస్యల పరిష్కా రానికి తక్షణమే చర్యలు తీసుకుంటానని జాయింట్ డైరెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కె.జాజులు, వై.ఎ. ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ. యుటిఎఫ్ సహాధ్యక్షులు ఎస్.నాగరాజు, ఎస్. పద్మ, కోశాధికారి టి.అప్పారావు, కార్యదర్శులు ఎస్.ప్రభాకర్‌రావు, జి. చిన్నబ్బాయి పెదగంట్యాడ ఎం.రామకృష్ణ, గడ్డినాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్-2 నాగేశ్వరరావు

విజయనగరం, న్యూస్‌లీడర్ : జిల్లాలో జరుగుతున్న సీసీ రోడ్లు, ఓడీఎఫ్, గృహ నిర్మాణ పనులు మార్చి నెలాఖరునాటికి పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్-2 కె. నాగేశ్వరరావు అన్నారు. మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, ఓడిఎఫ్, గృహ నిర్మాణ పనులకు లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పనులు త్వరితగతిన చెయ్యాలన్నారు. పనుల విషయంలో రాజీపడకుండా పక్కాగా, పారదర్శకంగా పనులు జరిగేటట్లు చూడాలన్నారు. ప్రభుత్వం యొక్క ఉద్దేశాన్ని నెరవే ర్చవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమస్యలు ఏమైనావంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్క రించుకోవాలన్నారు. మండలాల వారీగా పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ద్వామా పీడీ బి. రాజగోపాలరావు, జిల్లా పరిషత్ సీఈఓ టి. వెంకటేశ్వరరావు, మండలాల నుండి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు మృతికి సంతాపం

శ్రీకాకుళం,న్యూస్‌లీడర్ ఇచ్ఛాపురం మాజీ శాసనసభ్యులు ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు మృతిపట్ల రాష్ట్ర ఇంధన శాఖ మం త్రి కిమిడి కళావెంకటరావు సంతాపం వ్యక్తం చేసారు. ఆయ న మృతి జిల్లాకు తీరని లోటు అన్నారు. శాసనసభ్యునిగా, ప్ర జాప్రతినిధిగా జిల్లాకు మంచి సేవలు అందించారన్నారు. జి ల్లా అభివృద్ధిలో కీలకపాత్ర వహించార న్నారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు

ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి



టెక్కలి న్యూస్‌టుడే: టెక్కలి నియోజకవర్గం టీడిపి కార్యాలయంలో పార్టీ సమావేశంలో స్థానిక నాయకులు వద్ద నుంచి మంత్రి అచ్చెనాయుడు కార్యాలయం అధికా రులు వచ్చి ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే తక్షణమే వారికి అందేలా చర్యలు చెపట్టమని మంత్రి ఆదేశాలు చారిచెసారాని లబ్ధి దారులకు వెంటనే అందేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో టెక్కలి మండల టీడీపి పార్టీ అధ్యక్షుడు బాగది శేషగిరిరావు,జెడ్పీటిసి.కర్నిక సుప్రియ ,మట్ట.పురుషో త్తం,ఎం పీటీసీ మామిడిరము,హనుమంతు రామకృష్ణ చపర గణపతి రావు, సర్పంచ్ కృష్ణవేణి కాళీ,ధోని కొండలరావు,జీరు వెంకటరెడ్డి,దల్లి ప్రసాద్ రావు,గుండి. సూర్యనారాయణ, గాంధీ,మరియు మండలం లోని ప్రెసిడెంట్‌లు ఎంపీటీసీలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పని సరి


సీసీఎల్ఏ అనిల్ చంద్ర పునేఠా



మాట్లాడుతున్న అనిల్ చంద్ర పునేఠా

విజయనగరం : రెవెన్యూ శాఖలో పూర్తిస్థాయిలో బయో మెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయాలని సిసిఎల్ఏ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. బుధవారం విజయ నగరం నుండి రెవెన్యూ అధికారులతో ఇ-ఆఫీస్, బయో మెట్రిక్, భూసమస్యలు, ఇళ్ల పట్టాలు పంపిణీ, నీటి తీరువా వసూళ్లపై సమీక్షించారు. విజయనగరం జిల్లాలో రూ.27 కోట్లు నీటి తీరువా వసూళ్లు చేయవలసి ఉండగా రూ.19 లక్షలు మాత్రమే వసూళ్లు చేశారన్నారు. నీటి తీరువా వసూళ్లపై తహశీల్దార్‌లను అప్రమత్తం చేయాలన్నారు. ఆర్థికేతర వినతులు వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఆర్ఎస్ రాజ్‌కుమార్, ఎస్‌డిసి ఆర్.శ్రీలత, సర్వే ఎడి బి.ఎల్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీలు పవన్‌ను లైట్‌గా తీసుకున్నాయా?



జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మద్దతు ఇచ్చిన రెండు ప్రధాన రాజకీయ పార్టీల నుంచి నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆయన అభిమానులు వాపోతున్నారు. అటు కేంద్రంలోని భాజపా, ఇటు తెలుగుదేశం పార్టీలు పవన్ ఇమేజిని ఉపయోగించుకొని, తరువాత పట్టించుకోవడం మానేసినట్టు కనిపిస్తోందని అంటున్నారు. సినిమాల్లో తనదైన రీతిలో నటించి గొప్ప స్టార్ ఇమేజిని, ఫాలో అప్‌ని సంపాదించుకున్న పవన్‌ని కరివేపాకులా వదిలేస్తున్నాయంటున్నారు. కొందరైతే అనవసరంగా రాజకీయాల్లోకి వచ్చి, కోరి సమస్యలు తెచ్చుకుంటున్నారంటూ సానుభూతి కూడా ప్రకటిస్తున్నారు.

నిధుల కేటాయింపు విషయంలో భాజపా, తెలుగుదేశం పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పవన్ నిధుల లెక్కలు తనకు చెప్పాలని అడుగుతూ ఈ నెల 15 డెడ్‌లైన్ కూడా విధించారు. అయినా ఎటువంటి స్పందనా లేదు. దీంతో పవన్ పరిస్థితి ఓ సాధారణ ఆర్టీఐ ఏజెంటును తలపిస్తోందంటూ ఆయన అభిమానులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. తమ నేతను రెండు ప్రభుత్వాలు లైట్ తీసుకోవడాన్ని జనసైన్యం జీర్ణించుకోలేకపోతోంది. పవన్ అడగ్గానే వివరాలు ఇవ్వకపోగా డెడ్‌లైన్ కూడా పట్టించుకోకపోవడం నేతలను అసహనానికి గురిచేస్తోంది.

ఇదిలా ఉండగా కేంద్రం నుంచి ఏపీకి వచ్చిన, రావాల్సిన నిధుల లెక్కలు తేల్చేందుకు పవన్ నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చిన నిధులను ఏ విధంగా ఖర్చు చేశారన్న దానిపై సమగ్ర వివరాలను రాష్ట్ర ప్రభుత్వం తనకు ఇవ్వాలని పవన్ కోరారు. అలాగే కేంద్రం కూడా రాష్ట్రానికి ఇచ్చిన నిధుల వివరాలు తెలియజేయాలన్నారు. ప్రభుత్వాలు స్పందించకపోతే ఏం చేయాలన్న దానిపై కార్యాచరణ రూపొందిస్తామని పవన్‌కళ్యాణ్ తెలిపారు. గతంలో కూడా పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం



విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినప్పుడు ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోకపోగా వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు ఉన్నాయని కావాలంటే చూసుకొమ్మని చెప్పింది. తాజాగా ఏపీ మంత్రి దేవినేని కూడా ఇదే చెప్పారు. అయితే వెబ్‌సైట్లో ఆ వివరాలు దొరక్కపోవడంతో పవన్ అసహనానికి గురయ్యారు. దీంతో అప్పుడు ఇవ్వని వాళ్లు ఇప్పుడు కూడా ఇస్తారన్న నమ్మకం తనకు లేదని, రాష్ట్ర ప్రభుత్వం తలుచుకుంటే కొన్ని గంటల్లోనే వివరాలు ఇవ్వగలదన్నారు.

జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటులో భాగంగా ఇప్పటికే ఉండవల్లి అరుణ్‌కుమార్, జయప్రకాశ్ నారాయణలను పవన్ కలిశారు. శుక్రవారం వామపక్ష నేతలు మధు, రామకృష్ణ లను కలవనున్నారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పాల్గొంటారు. నిధుల లెక్కలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించని నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై ఈ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితిలో జనసేన అధినేత ఏ నిర్ణయం తీసుకుంటారో అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఐపీఎల్ 11వ సీజన్ షెడ్యూల్
విడుదల చేసిన బీసీసీఐ!



బీసీసీఐ ఐపీఎల్ 11వ సీజన్ షెడ్యూల్ కు సంబంధించిన వివరాలను ప్రకటించింది. ఈ సీజన్‌లో అన్ని ఫ్రాంచైజీలు కలిపి మొత్తం 60 మ్యాచ్‌లు ఆడనున్నాయి. దీనికోసం వివిధ రాష్ట్రాల్లోని 9 స్టేడియాలను ఎంపిక చేశారు. ఏప్రిల్ 7న మొదలై మే 27వ తేదీ వరకు 51వ రోజులపాటు కొనసాగనున్నాయి. మొట్టమొదటి మ్యాచ్‌లో తలపడనున్న ముంబై ఇండియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ కి ముంబై లోని వాంఖడే స్టేడియం వేదిక కానుంది. అలాగే మే 27న జరిగే ఫైనల్ మ్యాచ్‌కి కూడా ముంబైలోని వాంఖడే స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ 60 మ్యాచ్‌ల్లోని 12 మ్యాచ్‌లు సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కాగా మిగితా 48 మ్యాచ్‌లు రాత్రి 8 గంటలకు ప్రసారం కానున్నాయి.

ఏప్రిల్ 29న కేదార్‌నాథుడి పునర్దర్శనం




గోపేశ్వర్: ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ శైవక్షేత్రం కేదార్‌నాథ్ ఆలయాన్ని తిరిగి ఏప్రిల్ 29న తెరువనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు భీమశంకర్‌లింగ్ ప్రకటించారు. ఆరోజు ఉదయం 6.15 గంటలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ తలుపులు తీస్తామని చెప్పారు. హిమాలయాల్లో కొలువైన కేదార్‌నాథుడి సన్నిధిలో ఏటా శీతాకాలంలో భారీగా మంచుకురుస్తుంది. ఆలయ ప్రధాన ద్వారాలు సైతం మంచులో కూరుకుపోతాయి. దీంతో చలికాలం ప్రారంభంలో ఆలయాన్ని మూసివేసి తిరిగి వేసవికాలంలో తలుపులు తీస్తారు.

నరబలి కేసులో ఆ తల ఆడ శిశువుదే
డీఎన్ఏ రిపోర్టులో వెల్లడి



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్‌లోని ఉప్పల్ చిలుకానగర్‌లో శిశువు నరబలి కేసులో పోలీసులు మరిన్ని ఆధారాలు సేకరించారు. రాజశేఖర్ ఇంటిపై దొరికిన చిన్నారి తలను ఆడ శిశువుదిగా డీఎన్ఏ రిపోర్టులో తేలింది. శిశువును బోయిగూడలో ఫుట్‌పాత్‌పై పడుకున్న వారి నుంచి అపహరించినట్లు గుర్తించారు. రాజశేఖర్ ఇంట్లో లభించిన రక్తపు మరకలు శిశువుదేనని తేలింది. చంద్రగ్రహణం రోజు చంద్రుడి కాంతి శిశువు తలపై పడేలా చేయాలని మంత్రగాళ్లు చెప్పడంతో రాజశేఖర్ దంపతులు ఈ విధంగా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆరోజు ఇంట్లో రాజశేఖర్ దంపతులు ఇంట్లో నగ్న పూజలు చేసి శిశువును బలి ఇచ్చినట్లు వెల్లడించారు. తలను డాబాపై ఉంచగా.. మొండాన్ని ప్రతాప సింగారం సమీపంలో మూసీనదిలో పడేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

కర్ణాటకలో బీజేపీని ఢీకొనేందుకు
మెగాస్టార్ గ్రీన్ సిగ్నల్
ఎన్నికల ప్రచార రంగంలోకి చిరంజీవి



కర్ణాటక: త్వరలో జరగనున్న కర్ణాటక శాసనసభ ఎన్నికలు బీజేపీకి, ప్రధాని మోదీకి అత్యంత కీలకమైనవి. ఈ ఎన్నికల ఫలితాలు 2019లో జరగబోయే సాధారణ ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలు ఈ ఎన్నికల్లో గెలవడానికి సర్వశక్తులు ఒడ్డబోతున్నాయి. ఇటీవలే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కర్ణాటకలో పర్యటించి, ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మరోవైపు బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కూడా ఇప్పటికే కర్ణాటకలో ఓ ర్యాలీ నిర్వహించారు.

ఈ నేపథ్యంలో కర్ణాటకలోని ఎన్నో ప్రాంతాల్లో భారీ సంఖ్యలో అభిమానులను కలిగి ఉన్న కాంగ్రెస్ నేత, మెగాస్టార్ చిరంజీవిని ఎన్నికల ప్రచారంలోకి దింపనుంది కాంగ్రెస్. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) కార్యాధ్యక్షుడు దినేష్ గుండూరావు మాట్లడుతూ, కనీసం వారం రోజుల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు చిరంజీవి అంగీకరించారని చెప్పారు. సినీ నటి ఖుష్బూ కూడా ప్రచారం చేస్తారని తెలిపారు. ప్రియాంక గాంధీని కూడా రప్పించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నామని... అయితే, ఇంతవరకు స్పష్టమైన హామీ రాలేదని చెప్పారు. మతోన్మాదమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్న బీజేపీ దూకుడుకు ఈ ఎన్నికల్లో బ్రేక్ వేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

క్రైస్తవులకు ఉచితంగా జెరూసలేం యాత్ర!

నాగాలాండ్‌లో అధికారంలోకి వస్తే అమలు చేస్తాం -బీజేపీ ప్రకటన హజ్ సబ్సిడీ ఎత్తివేసి, ఇలాంటి హామీలెలా ఇస్తారు?: ఎంపీ అసదుద్దీన్

న్యూఢిల్లీ : ముస్లింలకు హజ్ సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం తొలగించిన నెలరోజుల తర్వాత.. తాజాగా బీజేపీ క్రైస్తవులకు జెరూసలేం ఉచిత యాత్ర ఆఫర్‌ను ప్రకటించింది. త్వరలో జరుగనున్న నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే క్రైస్తవులను ఉచితంగా జెరూసలేం యాత్రకు పంపుతామని బీజేపీ హామీ ఇచ్చింది. అయితే ఈ హామీ కేవలం నాగాలాండ్‌కే పరిమితమా? ఈశాన్య రాష్ట్రాల్లోని క్రైస్తవులందరికీ కల్పిస్తారా? దేశంలోని క్రిస్టియన్లందరికీ వర్తిస్తుందా? అనే విషయాన్ని స్పష్టంగా చెప్పలేదు. త్వరలో జరుగనున్న ఈశాన్య రాష్ట్రాల(మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర) ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ హామీని బీజేపీ తెరపైకి తెచ్చినట్లు తెలుస్తున్నది. మేఘాలయలో 75శాతం జనాభా, నాగాలాండ్‌లో 88 శాతం జనాభా క్రైస్తవులే.

ఈమేరకు క్రైస్తవులను తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. నాగాలాండ్‌లో తమకు అధికారం కట్టబెడితే, క్రైస్తవులకు ఉచితంగా జెరూసలేం యాత్రకు పంపుతామని బీజేపీ వాగ్దానం చేస్తున్నది అని వుయ్ ది నాగాస్ అనే వార్తాసంస్థ ట్విట్టర్‌లో వెల్లడించింది. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఎన్నాళ్లుగానో ఇస్తున్న రాయితీని నెలరోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. తద్వారా మిగిలే నిధులను మైనార్టీల సంక్షేమానికి ఉపయోగిస్తామని ప్రకటించింది. మైనార్టీలను బుజ్జగించడం కోసం కాకుండా, వారికి సగౌరవంగా సాధికారత కల్పించేందుకే తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తున్నదని అప్పట్లో కేంద్రమంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. ఈ నేపథ్యంలో బీజేపీ తాజా హామీని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తప్పుపట్టారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ క్రిస్టియన్లను ఉచితంగా జెరూసలేం పంపుతామని హామీ ఇస్తున్నది.



సబ్సిడీ ఏదైనా సరే.. అందరికీ ఒకేలా ఉండాలి. ముస్లింలకు హజ్ సబ్సిడీని తొలగించడం, హిందూవులకు మానససరోవరం యాత్ర సబ్సిడీని కొనసాగించడం, క్రిస్టియన్లను ఉచితంగా జెరూసలేం పంపుతామని ప్రకటించడం సరైన పద్ధతి కాదు అని అసదుద్దీన్ తెలిపారు. ఎన్నికల్లో ఉపయోగపడేలా ఉంటే బీజేపీ ముస్లింలకు కూడా రాయితీ కొనసాగించేదని, ఇదే ఆ పార్టీ నమ్మిన ఇండియా ఫస్ట్ నినాదమని ఆయన ఓ ట్వీట్‌లో విమర్శించారు. మతపరమైన యాత్రలకు రాయితీలు ఇవ్వడాన్నే తాము వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం తెలిపింది. మరోవైపు బీజేపీ హామీపై ఇజ్రాయిల్ మీడియా భిన్నంగా స్పందించింది. ప్రభుత్వాలు యాత్రికులను సబ్సిడీపై పుణ్యక్షేత్రాలకు పంపాలనుకోవడం ఇదేమీ తొలిసారి కాదని, నైజీరియా తమ దేశంలోని ముస్లిం, క్రిస్టియన్ యాత్రికులను మక్కా, జెరూసలేంకు ఏటా పంపుతున్నదని జెరూసలేం పోస్ట్ అనే పత్రిక తెలిపింది. అయితే ఈ తరహా ఎన్నికల హామీలన్నీ తర్వాత క్రమంగా మరుగున పడుతాయని వ్యాఖ్యానించింది.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జుమా రాజీనామా



జోహెన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకోబ్ జుమా గురువారం తన పదవికి రాజీనామా చేశారు. పదవి నుంచి తప్పుకోకపోతే పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి తొలగింపజేస్తామని అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) పార్టీ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆయన రాజీనామా సమర్పించారు. జుమా అవినీతి ఆరోపణలతో పాటు.. దేశంలో నిరుద్యోగితను పరిష్కరించలేకపోయారని, ఆర్థికమాంద్యాన్ని చక్కదిద్దలేకపోయారని జుమా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఏఎన్‌సీ పార్టీ సోమవారం సమావేశమై జుమాను రాజీనామా చేయాల్సిందిగా కోరారు. కానీ అప్పుడు జుమా రాజీనామాకు ససేమిరా అన్నారు. పార్టీ ఆదేశించిన మూడు రోజుల అనంతరం నేడు జుమా పదవి నుంచి వైదొలిగారు. దక్షిణాఫ్రికా అధ్యక్ష పదవికి రాజీనామా చేశానని జుమా నేషనల్ టెలివిజన్ ప్రసారంలో వెల్లడించారు. దీంతో ఆయన తొమ్మిదేళ్ల పాలనకు తెరపడింది. అసలైతే 2019 సాధారణ ఎన్నికలతో ఆయన రెండోసారి అధ్యక్షుడిగా పదవీకాలం ముగియాల్సి ఉంది. ఉప అధ్యక్షుడు సైరిల్ రమాఫోసాను జుమా స్థానంలో నియమించాలని ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ నిర్ణయించింది. రెండు నెలల క్రితమే ఏఎన్‌సీ సైరిల్‌ను ఎంపిక చేసింది. కొత్త అధ్యక్షుడిని నియమించే వరకు సైరిల్ రమాఫోసా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకోనున్నారు.

సైరిల్‌ను తన స్థానంలో నియమించడం తప్పు అని జుమా పేర్కొన్నారు. తన పార్టీ నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. తాను పార్టీలో ఎప్పటికీ క్రమశిక్షణతోనే ఉన్నానన్నారు. తాను అదే పార్టీలో కొనసాగుతానని, యువకుడిగా ఉన్నప్పుడే ఏఎన్‌సీలో చేరి ఉద్యమాల్లో పాల్గొన్నానని జుమా తెలిపారు.

పదవి నుంచి వైదొలగాలని లేదంటే పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కావాలన్న అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఆదేశాలను బుధవారం ఆయన ధిక్కరించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలో పార్టీ కారణాలు చెప్పలేదని ఒక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మరోవైపు జుమా సంక్షోభం నేపథ్యంలో దక్షిణాఫ్రికా పోలీసులు భారత సంతతి గుప్తా కుటుంబం నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ వివాదాస్పద వ్యాపార కుటుంబంతో జుమాకు సంబంధాలున్నాయి. సోదాల సందర్భంగా ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు లొంగిపోయే అవకాశాలున్నాయి. గుప్తా సోదరులు దక్షిణాఫ్రికాలో రాజకీయాలపై విస్తృత ప్రభావం చూపిస్తున్నారు. వారి వ్యాపార ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నది విమర్శకుల ఆరోపణ. జుమా, ఆయన కుమారుడు, కుమార్తె, జుమా భార్యల్లో ఒకరితో గుప్తా కుటుంబానికి స్నేహసంబంధాలున్నాయి.

పీఎన్‌బిలో భారీ కుంభకోణం
అవినీతి తిమింగలాలను కాపాడేందుకు మోసపూరిత లావాదేవీలు



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకులో చోటు చేసుకున్న భారీ కుంభకోణం నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జారీచేసింది. అన్ని బ్యాంకులు వెంటనే స్టేటస్ రిపోర్టును అందించాలని ఆదేశించింది. సత్యం కంప్యూటర్స్ రూ.9వేల కోట్ల స్కాం అనంతరం, పీఎన్‌బీలో చోటుచేసుకున్న ఈ కుంభకోణమే అతిపెద్దది. దాదాపు రూ.11,346 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్టు బ్యాంకు గుర్తించింది. పెద్ద పెద్ద అవినీతి తిమింగలాలు తప్పించుకోవడానికి వీలులేదని, ఇదే సమయంలో నిజాయితీ రుణగ్రహీత వేధించబడవద్దని ఆర్థిక మంత్రిత్వ శాఖ అన్ని బ్యాంకులకు సీరియస్ ఆదేశాలు జారీచేసింది. వెంటనే స్టేటస్ రిపోర్టును తమకు అందించాలని తెలిపింది. పీఎన్‌బీలో చోటుచేసుకున్న ఈ కుంభకోణంపై సీబీఐ, ఈడీ విచారణను ముమ్మరం చేశాయి. కొంతమంది అకౌంట్ హోల్డర్స్ ప్రయోజనార్థం పీఎన్‌బీ ముంబై బ్రాంచులో ఈ మోసపూరిత లావాదేవీలు జరిగినట్టు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ మోసపూరిత లావాదేవీల నగదు విదేశాలకు తరలి వెళ్లినట్టు తెలుస్తోంది. దీంతో విదేశీ బ్యాంకు బ్రాంచులపై కూడా విచారణ చేపడుతున్నారు. ప్రముఖ జువెల్లరీ, బిలీనియర్ నిరవ్ మోదీకి, ఈ స్కాంకు సంబంధం ఉన్నట్లు బ్యాంకు ఆరోపిస్తోంది. ఇప్పటికే నిరావ్‌మోదీని సీబీఐ అదుపులోకి తీసుకుంది. అంతేకాక మరో నాలుగు బడా జువెల్లరీ సంస్థలపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు నీరవ్‌మోదీ, మెహుల్‌చొక్సి బ్యాంకు అకౌంట్లు మోసపూరితమైనవిగా తేలింది.

జూన్ 2 నుంచి అన్న 'ఎన్నికల' క్యాంటీన్‌లు



అమరావతి: 2014 జూన్ 2న టీడీపీ ప్రభుత్వం పాలన ప్రారంభించిన సరిగ్గా నాలుగేళ్లకు "అన్న క్యాంటిన్‌లు" పూర్తి స్థాయిలో ఏర్పాటుకు ప్రభుత్వం సన్నద్ధమయింది. రాష్ట్రంలో లక్ష జనాభా పైబడిన 33 మున్సిపాలిటీలో 200 అన్న క్యాంటీన్‌లను ఈ ఏడాది జూన్ 2న ఏపీ ప్రభుత్వం ప్రారంభించనున్నది. ఇప్పటి వరకు వెలగపూడి సచివాలయం, మందడం తదితర ప్రాంతాల్లో నామ మాత్రంగా తక్కువ సంఖ్యలో నిర్వహిస్తున్న అన్న క్యాంటిన్‌లు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ఇందుకు సంబంధించిన సంవత్సరన్నర క్రితం మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో సమీక్షలు కూడా నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రధాన కార్పొరేషన్‌లో అన్న క్యాంటిన్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో క్యాంటిన్‌లు ఏర్పాటుచేయడంపై ప్రతిపక్ష నాయకులు టీడీపీని విమర్శిస్తున్నారు. కేవలం ఎన్నికల కోసమే ఈ క్యాంటిన్‌లు ఏర్పాటుచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన ఫైబర్‌గ్రిడ్ కనెక్షన్‌లు కూడా పూర్తిస్థాయిలో అమలుకావడంలేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలు పేరుకు మాత్రమే తప్పించి వాటి ప్రయోజనం అంతంతమాత్రమేనన్న వాదనాలు వినిపిస్తున్నాయి. మూడున్నరేళ్లగా క్యాంటిన్‌ల ఏర్పాటును పక్కనపెట్టి ఇప్పుడు తెరపైకి తీసుకురావడమే ఇందుకు కారణమంటున్నారు. ఈ క్రమంలోనే తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు, కర్ణాటకలోని బెంగళూరులో ఇందిరా క్యాంటీన్ల పనితీరును స్వయంగా మంత్రి నారాయణ ఇటీవల పరిశీలించారు. ఇదే అంశంపై బెంగళూరు అధికారులతో క్యాంటీన్ల నిర్వహణపై మంత్రి చర్చించారు. బెంగళూరులో ఇందిరా క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించారన్నారు. బెంగళూరు తరహాలో ఏపీలోనూ అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించనున్నారు. రాష్ట్రంలో మొదటి విడతగా 200 అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు సమకూర్చనున్నారు. అన్న క్యాంటిన్‌ల భవనాలు ఉపాధి హామీ నిధులతో నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాజకీయం.. గేటు బయటే జనసేన

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డుషోలు, పాదయాత్రలు చేయడం అంతకంటే కాదు. ప్రస్తుతం జనసేన అధినేత రాజకీయ అధికారానికి, సామాజిక సేవ భావనికి మధ్యన కనిపించీకనిపించని సన్నని గీతపై నిలబడి కొట్టుమిట్టాడుతున్నట్లు కనిపి స్తోంది. రానున్న ఎన్నికల్లో పోటీతథ్యమని ప్రకటించిన జనసేనాని ఇందుకు తగిన ఏర్పాట్లలో ఇంకా వెనుకబడే ఉన్నారు. జనసేనానికి రాజకీయంగా అండదండలు కల్పించే ఉపసేనానులు జిల్లాల్లో కరువయ్యారు.

అభిమానులే అలంబనగా...: నిజమే, జనసేనకు అభిమానులే కొండంత అండ. అభిమానులే ఓటు బ్యాంకు. ఈ ఊహతోనే జనసేనాని అడుగుముం దుకు వేసినట్లు కనిపిస్తోంది. అంత వరకు ఇది బాగానే ఉంది. కానీ, రాజకీయానికి అభిమానానికి ముడిపెట్టడం అంతుపట్టని విషయం. అభిమానులందరూ ఓటర్లు కాదు, ఓటర్లందరూ అభిమానులూ కాలేరు. ఈ సూక్ష్మాన్ని జనసేనాని తెలుసుకోలేదా! లేదు అని మాత్రం చెప్పలేము. ఆలోచనలు ఎలావున్నా ఆచరణలో వేగం శూన్యం.ఇప్పటికి కూడా రాష్ట్రంలోని 13 జిల్లాల్లో జనసేనాని వెంట రాజకీయ సమరంలో పాల్గొనే ఉపసేనానులు ఎవరనేది స్పష్టత లేదు. జనసేనానిఉద్దేశంలో ఏ రాజకీయపక్షానికి చెందిన వారికి తన పార్టీలో అవకాశం కల్పించరు. అంతా కొత్త రక్తమే. ఇది సాధ్యమేనా? పూర్తిగా మాత్రం సాధ్యం కాదు. తెలుగు సినీ ప్రపంచాన్ని ఉర్రూ తలూగించి సాటిలేని మేటి నటునిగా, విశ్వవిఖ్యాత నటసార్వభౌమునిగా ఒక వెలుగు వెలిగిన మహానటుడు ఎన్టీఆరే రాజకీయప్రవేశం చేసేసమయంలో ఎందరో రాజకీయ, రాజకీయేతర ప్రముఖులతో సమీక్షించి, విశ్లేషించి తెలుగువారి ఆత్మగౌరవం నినాదంగా అడుగు ముందుకు వేశారు. అభిమానులు కాదు... ప్రజలే ఆదరించారు. అప్పుడునెలకొన్న రాజకీయ పరిస్థితులను తనకు అనుకూలంగా మరల్చుకోవడంలో ఎన్టీఆర్ కృతకృత్యులయ్యారు. ఇందు కు కాంగ్రెస్ వైఫల్యాలు బాగా కలిసివచ్చాయి. అందుకనే అభిమానులకంటే ఎక్కువగా ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించారు. ప్రస్తుతం జనసేనాని పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అలాగని జనసేనాని తక్కువ అంచనా వేయలేం. ఎందుకంటే 2014 ఎన్నికల్లో అటు బిజెపికి, ఇటు తెలుగుదేశం పార్టీకి తెరవెనుక నుండి జనసేనాని చక్రం తిప్పారు. పవనిజంతోనే తెలుగు దేశం పార్టీ విజయం సాధించిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. మరి అదేపరిస్థితి ఇప్పుడు ఉంటుందా అంటే సందేహమే. ఎందుకంటే అప్పుడు తెరవెనుక ఉండి అభిమానులతో కథ నడిపించారు. ఇప్పుడు తెరముందుకు వచ్చి రాజకీయప్రవేశాన్ని ఖరారు చేశారు.

కేడర్ ఏదీ?: ఏ రాజకీయ పక్షానికైని కేడర్ ప్రధానం. ఇప్పటిదాకా అభిమానులే ఉన్నారు. కానీ,రాజకీయపక్షానికి కావాల్సింది క్రియాశీలక కార్యకర్తలు. చురుకైన నాయకులు. అభిమానులు ప్రజలను ఆకర్షిస్తారా అన్నది బేతాళప్రశ్న. అసలు జనసేన రాజకీయపక్షమేనా? అది గుర్తింపు ఇవ్వాల్సింది భారత ఎన్నికల సంఘం. ఇందుకు దరఖాస్తు చేశారా...!? మరోవైపు ఏ జిల్లాలో కూడా నాయకులు గానీ, కేడర్ గాని లేరు. ఇప్పటివరకు జనసేనాని పిలుపు మేరకు అభిమానులే స్పందిస్తున్నారు. అభిమానులతోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. పవన్ ఆలోచనలు బాగున్నాయి. మోసపోయిన ఆంధ్రుల విషయంలో పవన్ ఆవేదన అర్థవంతంగా ఉంది. ప్రత్యేకహోదా కోసం జేఏసీని ఏర్పాటు చేయాలన్నప్రతిపాదన ఆహ్వానించదగ్గదే. కానీ, ఆచరణలోనే అనేక సందేహాలు ఉన్నాయి. ప్రత్యేకహోదా కోసం ఏర్పాటుచేసే జేఏసీలో తెలంగాణ నాయకులతో పనేంటో అర్థంకాదు. ఒకసారి ఆంధ్రుల గురించి, మరొకసారి తెలంగాణ ప్రజల గురించి మాట్లాడుతుండటం కాస్తంత గందరగోళ పరిస్థితిని కలిగిస్తోంది. రాజకీయాల్లోకి రావాలన్నది స్పష్టమైనా సైద్ధాంతికపరమైన విషయాల్లో స్పష్టత లోపించింది. ఇంతకీ పవన్ పోరు వ్యవస్థపైనా, ఇలాంటి వ్యవస్థకు కారకులైన ప్రజాప్రతినిధులపైనా, ప్రజలకు మధ్య పెడుతున్న రాజకీయనాయకులపైనా అన్నది తేలాల్సివుంది.

జిల్లా నాయకుడు ఎవరు?: విజయనగరం జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సమస్యలపై పోరాటంతో పవన్ పిలుపునిస్తే జిల్లాలో ఓ రెండు జనసేన జెండాలు రెపరెపలాడుతుంటాయి. కానీ వారు పవన్ అభిమానులే. వారి దగ్గరకి వెళ్లి అసలు పార్టీ అజెండా ఏంటి అంటే సమాధానం లేదు. తమ అభిమాన నటుడు పిలుపిచ్చారు మేం చేస్తున్నాం అన్న ధోరణే తప్ప స్పష్టత వారికి కూడా లేదు. ఇంతకీ మీ హోదా ఏంటంటే అభిమానులనే అంటారు. ఇదే అభిమానులు ఆయన సినిమా విడుదల రోజున థియేటర్ల దగ్గర కనిపిస్తారు. 300 రూపాయలు టిక్కెట్ కొనుక్కొని సినిమా చూస్తారు. దాదాపు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోను, మండలాల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్నికల దగ్గర పడుతున్న నేపథ్యంలో జనసేనాని అడుగు ఎటో అన్న సంశయం అభిమానుల్లోను లేకపోలేదు. పిల్లిమెడలో గంట ఎవరు కడతారు అన్నచందంగా ఎవరికి వారు జనసేనాని ముందు జనసేన రాజకీయభవిష్యత్ ఏమిటని ప్రశ్నించలేకపోతున్నారు. నిజంగా ఒక రాజకీయపార్టీగా అవతరించి, ప్రజాభిమానాన్ని చూరగొని ప్రజాసమస్యలపై అధికారికంగా పోరాడగలిగితే "జన" సేన పేరు సార్థకమవుతుంది. కాని పక్షంలో అభిమానులే ఆయుధంగా వచ్చే ఎన్నికల్లో కూడా మరో రాజకీయపక్షానికి లబ్ధిమాత్రమే చేకూరుతుంది.

సప్తగిరి కోసం బాహుబలి పెన్నా?

కమెడియన్స్ హీరోగా మారటం ఈ రోజుల్లో చాలా వరకు కామన్ అయిపోయింది. అప్పట్లో కొంచెం టైమ్ ఎక్కువ పట్టేది. కానీ ఇప్పుడు ఓ రెండేళ్లు కమెడియన్ గా క్లిక్ అయితే చాలు వారి కోసం మంచి కథలు రెడీ అవుతున్నాయి. ఇటీవల కమెడియన్ సప్తగిరి హీరోగా కొన్ని ప్రయత్నాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. సప్తగిరి ఎక్స్ ప్రెస్ తో పరవాలేదు అనిపించి నెక్స్ట్ మరొక వెరైటీ కథతో వచ్చాడు. అది కూడా బాలీవుడ్ సినిమాకు రీమేక్ అవ్వడం మనోడి అదృష్టం అని చెప్పు కోవాలి. అతని మార్కెట్‌కి మించి డబ్బుని ఖర్చు చేయడానికి కూడా వెను కాడటం లేదు. ఇక అసలు విష యానికి వస్తే.. రీసెంట్‌గా ఈ కామెడీ హీరో కోసం ఒక బడా రచ యితను సెట్ చేశారు. సీనియర్ మోస్ట్ రైటర్ బాహుబలి రచయిత విజయేంద్ర ప్రసాద్ సప్తగిరికి కథను రాసే పనిలో పడ్డాడట. సప్తగిరి రేంజ్ కి ఈ రైటర్ ని వాడుతున్నారంటే టూ మచ్ అనే కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి.



నాగార్జున సరసన కన్నడ బ్యూటీ

ఈ నెలలోనే నాగార్జున, నాని హీరోలుగా మల్టీ స్టారర్ మూవీ ప్రారంభం కాబోతోంది. తాజాగా ఈ మూవీలో ఓ హీరోయిన్ ను ఫిక్స్ చేశారు. సినిమాలో నాగార్జున సరసన కన్నడ బ్యూటీ శ్రద్ధా శ్రీనాథ్‌ను హీరోయిన్‌గా తీసుకుంటు న్నారట. మూవీ లాంచింగ్ రోజున ఈ మేటర్ ను అఫీషియల్ గా ప్రకటించబోతున్నారు. కన్నడలో యూ–టర్న్ అనే హిట్ మూవీలో నటించింది శ్రద్ధా శ్రీనాథ్. ఈమధ్య తమిళ నాట హిట్ అయిన విక్రమ్ వేద అనే సినిమా లో కూడా నటించింది. స్టోరీ ప్రకారం ఈ అమ్మాయి అయితే బాగుంటుందని దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య ఫిక్స్ అయ్యాడట. సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ లో నాగ్, శ్రద్ధా శ్రీనాథ్ మధ్య సన్నివేశాలు వస్తాయట. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వనీదత్ నిర్మాతగా ఈసినిమా రాబోతోంది. 'అ!' సినిమా థియేటర్లలోకి వచ్చిన వెంటనే నాని ఫ్రీ అయిపోతాడు. సో.. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈ నెలాఖరు నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. మణిశర్మ సంగీతం అందించబోతున్నాడు.

ఫస్ట్ ప్రభాస్ పెళ్లి.. నెక్ట్స్ నాది!



తొలిప్రేమ సక్సెస్ తో హుషారుగా ఉన్న వరుణ్ తేజ్, మీడియా ఇంటర్వ్యూల్లో భాగంగా తన పర్సనల్ విషయాల్ని కూడా షేర్ చేసుకుంటున్నాడు. ఇందులో భాగంగా తన లవ్ లైఫ్, పెళ్లికి సంబంధించి రియాక్ట్ అయ్యాడు వరుణ్ తేజ్. "ప్రస్తుతానికి నా లైఫ్ లో లవ్ లేదు. నా కెరీర్ తోనే నేను ప్రేమలో ఉన్నాను. మరో సక్సెస్ వచ్చింది కదా, కెరీర్ పై ప్రేమ ఇంకా పెరిగింది. ఇక వాలంటైన్స్ డే విషయానికొస్తే నా ఫ్రెండ్స్, బాయ్స్ తో బయటకు వెళ్తాను. ఎక్కడికి వెళ్తున్నావని ఇంట్లో అడుగుతారు. కానీ నేనేంటో వాళ్లకు తెలుసు. ఓసారి ఓ అమ్మాయి కోసం నా ఇంట్లో నేనే కేక్ తయారుచేశాను. అమ్మకు తెలుసు." ప్రేమ సంగతి పక్కనపెడితే పెళ్లికింకా చాలా టైం ఉందంటున్నాడు వరుణ్. ప్రస్తుతానికి తన మైండ్ లో పెళ్లికి సంబంధించిన ఆలోచనలు లేవని, తనకంటే ముందు నితిన్, ప్రభాస్ పెళ్లి చేసుకోవాలని అంటున్నాడు. "పెళ్లికింకా చాలా టైం ఉంది. నితిన్, ప్రభాస్ అన్న ఇంకా పెళ్లి చేసుకోలేదు కదా. వాళ్లే నాకు ఇన్స్పిరేషన్. ఇప్పటి వరకు పెళ్లి, ప్రేమ గురించి ఆలోచించలేదు. అదొక వేరే ప్రపంచంలా అనిపిస్తుంది. కానీ ఎప్పటికైనా చేసుకోవాలి కదా. ఏదో ఒక రోజు చేసుకుంటా. మెంటల్లీ నేను ఫిక్స్ అయినప్పుడు తప్పకుండా పెళ్లి చేసుకుంటా." ఇలా ప్రేమ, పెళ్లిపై తన మనసులో అభిప్రాయాన్ని వెల్లడించాడు వరుణ్. ఈ హీరో నటించిన తొలిప్రేమ సినిమా తాజాగా వరల్డ్ వైడ్ 26 కోట్లు వసూలు చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ మూవీ వసూళ్లు 10 కోట్లు దాటాయి. శివరాత్రి కారణంగా నిన్న ఒక్కరోజే నైజాంలో ఈ సినిమాకు కోటి రూపాయల షేర్ వచ్చింది.



జగన్నాథ నాటక కళాప రిషత్ 46వ వార్షికోత్సవం సందర్భంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పుర స్కరించుకొని విశాఖలోని జగదాంబ సెంటర్ వద్ద నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో అనకాపల్లికి చెందిన శ్రీ వెంకటసాయి కళానికేతన్ శిరీషా బృందంచే భరతనాట్యం నిర్వహించబడింది. ఈ సాంస్కృతిక కార్యక్రమంలో అనకాపల్లికి చెందిన మ్యానాజైన్ విశాఖ నగర వాసుల మన్ననలను పొంది మొదటి బహుమతిని సాధించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు మాన్యాజైన్‌కి తమ ప్రశంసలను అందజేశారు.

–న్యూస్‌లీడర్, అనకాపల్లిటౌన్



అక్కతో చేస్తే అదే ఆఖరు సినిమా



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ డైరెక్షన్ లో ప్రిన్స్ మహేష్ బాబు హీరోగా చేసిన 'అతడు'సినిమాను మహేష్ అభిమాను లెవరూ అంత తేలిగ్గా మరిచిపోరు. అందులో మహేష్ సైలెంట్ గా కనిపిస్తాడు. కానీ ఛాన్స్ దొరికినప్పుడల్లా పంచ్ లు వేస్తూ అందరినీ తెగ ఉడికించేస్తాడు. ఈ క్యారెక్టర్ కాస్త మహేష్ రియల్ లైఫ్ కు దగ్గరగానే ఉంటుంది. రీసెంట్ గా మహేష్ పంచ్ దెబ్బ అతడి అక్క మంజులకు కాస్త గట్టిగానే తగిలింది. కొత్త గా డైరెక్టర్ అవతారం ఎత్తిన మంజుల సందీప్ కిషన్ హీరోగా 'మనసుకు నచ్చింది'సినిమా పూర్తి చేసింది. ఈ సినిమాకు మహేష్ బాబు వాయిస్ ఓవర్ ఇచ్చాడు. ఇందుకు కారణం అతడి అక్కేనన్న విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మంజుల ఆంటీ డైరెక్షన్ లో సినిమా ఎప్పుడు చేస్తావని మహేష్ కొడుకు గౌతమ్ అడగ్గా... "మీ ఆంటీతో చేస్తే అదే నా ఆఖరు సినిమా" అంటూ వెంటనే పంచ్ వేసేశాడట. ఈ విషయం మంజులే స్వయంగా బయటపెట్టింది. మంజుల యాక్టర్ గా మొదటి సినిమాతోనే అదరగొట్టేసింది. నిర్మాతగా బ్లాక్ బస్టర్ తీసిన చరిత్ర సొంతం చేసుకుంది. ఇప్పుడు కొత్తగా డైరెక్షన్ కూడా పూర్తి చేసింది. ఇందులోనూ రాణిస్తే తండ్రి తగ్గ తగిన కూతురనే కీర్తి సొంతమవుతుంది. తమ్ము డితో సినిమా చేయడానికి కావలసిన ధైర్యమొచ్చేస్తుంది. ఫ్యూచర్లో అక్కతో సినిమా చేసే అవకాశం ఉందని మహేష్ ఇప్పటికే చెప్పాడు.

ఎమోషనల్‌గా చాలా క్లోజ్

1ఓ వైపు కాజల్, మరోవైపు నాని.. సినిమాల పరంగా వీళ్లిద్దరికీ ఎలాంటి సంబంధం లేదు. కలిసి మూవీ చేయలేదు. ఏదో ఫంక్షన్ లో కలుసుకున్న సందర్భాలు కూడా లేవు. కానీ 'అ!' సినిమాతో ఇద్దరూ ఒక్కటయ్యారు. తమ మధ్య బంధం బయటకు కనిపించేది కాదని, ఎంతో భావోద్వేగంతో కూడినదని చెబుతోంది కాజల్."నేను, నాని పెద్దగా కలుసుకోలేదు. బయట పార్టీల్లో కూడా మేం ఒకసారి మాత్రమే కలిసినట్టు గుర్తు. అప్పుడు కూడా పెద్దగా మాట్లాడుకోలేదు. కానీ మేమిద్దరం ఎమోషనల్ గా చాలా క్లోజ్. ఎందుకంటే మా ఇద్దరి మైండ్ సెట్ ఒకటే. మా ఇద్దరికీ పనే లోకం. ఒకరి లైఫ్ స్టయిల్ ఏంటో మరొకరికి తెలుసు." ఇలా నానిని ఆకాశానికెత్తేసింది కాజల్. 'అ!' సినిమా సెట్స్ లో మాత్రమే తామిద్దరం ప్రొఫెషనల్ గా కలుసుకున్నామని, అప్పటివరకు కాజల్ తో ఫేస్ టు ఫేస్ మాట్లాడే సందర్భం రాలేదని అంటున్నాడు నాని. 'అ!' సెట్స్ లో కూడా కేవలం ఒకసారి మాత్రమే కాజల్ ను పలకరించానంటున్నాడు. "మొదటి రోజు కాజల్ సెట్స్ పైకి వచ్చినప్పుడు ఆమెకు వెల్ కం చెప్పాను. ఆ రోజు మేమిద్దరం మాట్లాడుకున్నాం. అంతే.. ఆ తర్వాత మళ్లీ కాజల్ ను కలవలేదు. 'అ!' మూవీ ఫంక్షన్ లో కలవడమే తప్ప మళ్లీ సెట్స్ పై చూడలేదు. నిజానికి ఈ సినిమాకు కాజల్ కేవలం 5 రోజులు మాత్రమే కాల్షీట్లు ఇచ్చింది.



రామలక్ష్మి కష్టం మామూలుగా లేదుగా..

పాత్ర నచ్చితే ఎలాంటి రోల్ చేయడానికైనా సిద్ధమే.. స్టార్ హీరోయిన్ల నోటి నుంచి తరచూ వచ్చే మాటే ఇది. అలాగని గ్లామర్ కంటెంట్ ఏ మాత్రం లేని పాత్ర ఆఫర్ చేస్తే అయిపు లేకుండా పోయేవారే ఎక్కువ. కానీ అక్కినేని వారి కోడలు సమంత మాత్రం ఈ విషయంలో గ్రేటనే చెప్పాలి. తాజాగా ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నరంగస్థలం మూవీలోని రామలక్ష్మి పాత్ర చూస్తే ఈ సినిమా కోసం శామ్ ఏ రేంజిలో చెమట చిందించిందో తెలుస్తుంది. అస్సలు గ్లామర్ కు స్కోప్ లేని పాతకాలం దుస్తుల్లో.. జడకు ఓ రిబ్బన్ పట్టుకుని కాళ్లకు చెప్పులు లేకుండా.. నెత్తిన చెరకు మోపుతో నడుస్తూ కనిపించింది. మరోచోట మురుగు నీళ్లలో నుంచుని గేదెలను కడుగుతూ కనిపించింది. ఎండలో తిరిగితే కందిపోతాం.. నీళ్లు బాగోలేకపోతే కమిలిపోతాం.. అంటూ కొంచెం ఎక్స్ ట్రా డైలాగులు చెప్పే హీరోయిన్లు సమంత కమిట్ మెంట్ చూస్తే కళ్లు తిరిగి పడిపోవడం ఖాయం.



'మేఘా'ల్లో తేల్చేస్తున్న ముగ్ధ

టాలీవుడ్ లో లేటెస్ట్ సెన్సేషన్ మేఘా ఆకాష్. లై చిత్రంతో నితిన్ కి జోడీ గా నటించిన ఈ భామకు.. ఆ మూవీ సక్సెస్ సాధించకపోయినా వరుస అవకాశాలు బాగానే వచ్చేస్తున్నాయి. ఇప్పటికే మూడు తమిళ సినిమాల్లో నటించేస్తున్న ఈ బ్యూటీకి.. తెలుగులో నితిన్ తో 'ఛల్ మోహన్ రంగా'తో పాటుగా కొన్ని ప్రాజెక్టులు చేతిలో ఉన్నాయంటే.. ఈ అందమైన అతివ స్పీడ్ ఏ స్థాయిలో ఉందో అర్ధమవుతుంది.

మేఘా ఆకాష్ కు పెరుగు తున్న క్రేజ్.. ఆమెను మేగజైన్ కవర్ పేజ్ లకు కూడా చేర్చేసింది. రీసెంట్ గా ఉమెన్ ఎక్స్ క్లూజివ్ మ్యాగజైన్ కవర్ పై ఈమె చేసిన సందడ అంతా ఇంతా కాదు. వేలంటైన్స్ డే స్పెషల్ గా రిలీజ్ చేసిన ఈ ఎడిషన్ లోపలి పేజీల్లో కూడా ఈ ముగ్ధ బోలెడన్ని కబుర్లతో పాటు.. మెరిసే అందాలను చూపే అందమైన ఫోటోలకు కూడా పోజులు ఇచ్చింది.

రామ్‌కి లోకల్ గ్యాంగ్ హిట్ ఇస్తుందా..

టాలీవుడ్ లవర్ బాయ్ గా తన కంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో రామ్ విజయాన్నీ చూసి చాలా రోజులు అవుతోంది. ఏ స్థాయిలో ప్రయత్నాలు చేసినా స్టార్ హీరోల లెవెల్లో హిట్స్ అందుకోలేకపోతున్నాడు. దీంతో కొద్దీ కొద్దిగా మార్కెట్ కూడా పడిపోతోంది. కానీ మనోడు ప్రయోగాలు చేయడానికి చాలా దూరంగా ఉంటాడు. ఎక్కువగా లవ్ స్టోరీలతో కూడిన కమర్షియల్ కథలనే గాని నటన పరంగా ప్రయోగం చేద్దామనే కథలను చేయలేదు. దీంతో రామ్ సైడ్ రెగ్యులర్ అభిమానులు తప్ప మరొకరు ఎక్కువగా చుడటం లేదు. కొన్ని నెలల క్రితం వచ్చిన ఉన్నది ఒకటే జిందగి సినిమా కూడా దారుణంగా ఫెయిల్యూర్‌ని అందుకుంది. అయితే ఇప్పుడు కూడా రామ్ మళ్లీ లవ్ యాంగిల్ సైడే షిఫ్ట్ అవుతున్నాడు. అంతే కాకుండా రెగ్యులర్ ఫార్మాట్ తో హిట్టు కొట్టే ఓ దర్శకుడితో సినిమా చేస్తున్నాడు. సినిమా చూపిస్త మావ – నేను లోకల్ సినిమా లతో మామా – అల్లుళ్ల మధ్య సాగే కాన్సెప్ట్ తో హిట్టు కొట్టిన దర్శకుడు త్రినాథ రావు రావు నక్కిన – రచయిత ప్రసన్న తో వర్క్ చేస్తున్నాడు. ఇక నేను లోకల్ సినిమాకు మ్యూజిక్ అందించిన దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాకు మ్యూజిక్ అందించను న్నాడు. దాదాపు నేను లోకల్ గ్యాంగ్ మొత్తంగా రామ్ సిని మాకు వర్క్ చేస్తోంది. ఈ సినిమా గత కొంత కాలంగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా ఉంది. ఫైనల్ గా పనులన్నీ పూర్తవ్వడంతో నిర్మాత దిల్ రాజు నేను లోకల్ గ్యాంగ్ తో రామ్ సినిమాను అదే కాన్సెప్ట్ తో షూటింగ్ ని పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యాడు.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832